Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 20.11.2015, శుక్రవారం | సంపుటి : 35 సంచిక : 25 | పేజీలు : 12, వెల : ₹ 5



ISO 9001-2008 CERTIFIED HOSPITAL

Dr. A.Swaroop Kumar Reddy, M.D.S.,
Professor - Department of Conservative Dentistry
Specialist - Cosmetic, Lasers & Implant Dentistry

CARE SUPER SPECIALITY DENTAL HOSPITAL
16-1/72, Pogathota, Nellore -524 001, (A.P.)
Ph: 0861-2303300, 6555555

Reimbursement Facility For
State Government, APSPDCL & SHAR Employees

# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com





## వరుణుడు ముంచెత్తాడు...

# ఊర్లు ఏరులయ్యాయి!

ఎవరయ్యా చెప్పింది చంద్రబాబు సీఎం అయితే వర్షాలు పడవని... ఎండలు కుమ్మేస్తాయని, కరువు కమ్మేస్తుందని... ఎవరు ఎవరు అన్నది. చంద్రబాబు వస్తే వర్షాలు రావు, ఇవిగో ఇలా వరదలు వస్తాయి, చెరువులకు గండ్లు పడతాయి, రోడ్లు కొట్టుకుపోతాయి, ఊర్లు మునిగిపోతాయి, కాలువలు తెగిపోతాయి, వర్షపునీరుంతా వరదలా మారి చివరకు సముద్రానికిపోతుంది. చంద్రబాబు పాలనలో ఎండలు కాసినా, వానలు కురిసినా అతిగానే ఉంటున్నాయి. ఏవీ మితంగా ఉండవు. **1995** నుండి **2004** దాకా ఇంతకుముందు తొమ్మిదేళ్లు సీఎంగా చేస్తే అప్పుడూ అంతే... *8*ఏళ్లు కరువు... **2000** సంవత్సరంలో మాత్రం ఇప్పట్లాగే వరదలు.

(మిగతా 11వ పేజీలో)

# నీళ్ళూరుగా నెల్లూరు

12లో





## ఇది 'నమ్మకం'

దాన్నే మేము మీలో నాటబోతున్నాం
అత్యంత ఆధునిక చికిత్సలు, శస్త్రచికిత్సలు
అవయవమార్పిడిలతోబాటుగా గ్లోబల్‌లో

GLOBAL™ HEALTH CITY
more to life
Chennai | Hyderabad | Bengaluru | Mumbai

- ★ మనదేశంలో మొట్టమొదటిసారిగా ఊపిరితిత్తుల మార్పిడి
- ★ మన దేశంలోనే మొదటిసారిగా ఒక కాలేయాన్ని ఇద్దరికి(ఆక్జిలరీ) కాలేయ మార్పిడిలను దిగ్విజయంగా నిర్వహించాం
- ★ మనదేశంలోనే మొదటిసారి ఒకే వ్యక్తికి గుండె, మూత్రపిండాల మార్పిడిని నిర్వహించిన ఆసుపత్రి
- ★ దక్షిణ ఆసియా ఖండంలోనే మొదటిసారిగా వెన్నులోని న్యూక్లియస్ మార్పిడిని విజయవంతంగా నిర్వహించాం
- ★ మనదేశంలో యాక్సిడెంట్‌లో దెబ్బతిన్న మెదడుకి మూలకణ చికిత్స నిర్వహించాం
- ★ మనదేశంలోనే అతిపెద్దదైన అవయవ మార్పిడి కేంద్రం

మన దేశంలోనే అతి పెద్దదిగా ఆవిర్భవిస్తున్న, అతి త్వరగా విస్తరిస్తున్న ఆస్పత్రుల సముదాయం. మీరు మాయుందుంచిన నమ్మకంతోనే ఇలా అన్ని మైలురాళ్లని అధిగమిస్తున్నాం. అత్యంత ఆధునిక సదుపాయాలు అనుభవజ్ఞులైన నిపుణుల సహకారంతో గ్లోబల్ ఆసుపత్రి మీ జీవితానికి అతిచేరువ అవుతుంది.

### గ్లోబల్ హాస్పిటల్స్ ప్రత్యేకతలు :

ఇనిస్టిట్యూట్ ఆఫ్ లివర్, పాంక్రియటిక్ డిసీజ్ అండ్ ట్రాన్స్‌ప్లాంటేషన్। ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ అండ్ థెరాపెటిక్ ఎండోస్కోపి। ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మినిమల్ యాక్సెస్ అండ్ బేరియాట్రిక్ సర్జరీ। అడ్వాన్స్‌డ్ హార్ట్, లంగ్ అండ్ వాస్క్యూలర్ ఇనిస్టిట్యూట్। ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూరోసైన్‌సెస్। ఇనిస్టిట్యూట్‌ఆఫ్ స్పైనల్ డిజార్డర్స్। కిడ్నీ ఇనిస్టిట్యూట్। ఇనిస్టిట్యూట్ ఆఫ్ యూరాలజీ। క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌అండ్ క్యాన్సర్ ఫర్ బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్। ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆర్థోపెడిక్ అండ్ జాయింట్ రీప్లేస్‌మెంట్। అడ్వాన్స్‌డ్ సెంటర్ ఫర్ ట్రామా అండ్ ఎమర్జెన్సీ కేర్। ఇనిస్టిట్యూట్ ఫర్ ప్లాస్టిక్, రీకన్‌స్ట్రక్టివ్ అండ్ కాస్మొటిక్ సర్జరీ। అడ్వాన్స్‌డ్ సెంటర్ ఫర్ క్రిటికల్ కేర్ అండ్ పల్మోనరీ। ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎండోక్రైన్, డయాబెటిక్, ఒబెసిటీ అండ్ మెటబాలిక్ డిజార్డర్స్.

www.globalhospitalsindia.com
గ్లోబల్ హెల్త్‌సిటీ, 439 చెరన్‌నగర్, పెరుంబాకం, పోలింగ నల్లూరు, చెన్నై - 600100
Ph: +91 - 44 - 4477 7000, Email: infochennai@globalhospitalsindia.com

గ్లోబల్ ఇన్‌ఫర్‌మేషన్ సెంటర్, నెం.16-2-230, క్రైజన్‌హైట్స్, పాత పంజాబ్ నేషనల్ బ్యాంక్ ప్రక్కన సండేమార్కెట్, పొగతోట, నెల్లూరు-1. ఎమర్జెన్సీ హెల్ప్‌లైన్ : 9989777101, 7680931555, 8978788116, 8978788115

24/7 UDANAE GLOBAL Emergency Care
✆044-4624 2424

# పట్టుబడ్డ రొయ్యల దొంగలు

నెల్లూరురూరల్ సబ్‌డివిజన్ పరిధిలో రొయ్యల దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు దొంగలను అరెస్ట్ చేసి వారి నుండి రెండున్నర లక్షల విలువచేసే రొయ్యలను స్వాధీనం చేసుకున్నట్లు సిసిఎస్ డిఎస్పీ పి.శ్రీధర్ తెలిపారు. ఈ నెల 14వ తేదీన నెల్లూరులోని సిసిఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విడవలూరు మండలం రామతీర్థం పాతూరుకు చెందిన ఎన్.వెంకటశేషయ్య అలియాస్ శేషారెడ్డి, గుంటూరు జిల్లా గురజాల మండలం కరంపూడికి చెందిన సి.హెచ్.సురేష్, నెల్లూరు, శెట్టిగుంటరోడ్డుకు చెందిన పి.గణేష్‌లు మరో ఐదుగురితో కలిసి ఒక ముఠాగా ఏర్పడ్డారు. ఈ ముఠా రామతీర్థం వద్ద బ్లూపార్క్ హేచరీ కంపెనీకి చెందిన రొయ్యల గుంటల్లో రొయ్యలను దొంగలించి మూడున్నర లక్షల రూపాయలకు అమ్ముకున్నారు. వాటిలో లక్ష రూపాయలను ఖర్చు చేయగా మిగతా రెండున్నర లక్షలను వెంకటశేషయ్య ఇంట్లో పెట్టివుంటే స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్పీ తెలిపారు.

ఈ ముఠా ఈ నెల 14న రామతీర్థం ప్రాంతంలో రొయ్యలగుంటల వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా విడవలూరు ఎస్ఐ వెంకట్రావ్, సిసిఎస్ ఎస్ఐ ఎన్.సుధాకర్‌లు వారి సిబ్బందితో వెళ్లి ముగ్గురిని పట్టుకున్నారు. మిగతా ముఠా సభ్యులను కూడా తొందరలోనే పట్టుకుంటామని డిఎస్పీ చెప్పారు. దొంగలను పట్టుకున్న ఎస్ఐలు, సిబ్బందిని ఎస్పీ గజరావ్‌భూపాల్ అభినందించి రివార్డులు ప్రకటించారని డిఎస్పీ తెలిపారు.

# రెడ్‌క్రాస్ రక్తనిధిలో ప్లేట్లెట్ల కొరత

నెల్లూరు రెడ్‌క్రాస్ రక్తనిధిలో ప్లేట్‌లెట్స్ కొరత తీవ్రంగా వుందని ప్రభుత్వ రక్తనిధి మూత పడడంతో రోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని శివాజీయూత్ ఫౌండేషన్ ఛైర్మెన్ మోపూరు భాస్కరనాయుడు పేర్కొన్నారు. 14వతేదీ నెల్లూరు ప్రెస్‌క్లబ్‌లో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ జిల్లాలో వందలాదిమంది రోగులు డెంగ్యూ జ్వరంతో హాస్పిటల్‌లో చేరడంతో ప్లేట్‌లెట్స్, ప్లాస్మా, హోల్‌బ్లెడ్‌లకు విపరీతమైన డిమాండ్ ఉందని, రోజుకు 400ప్యాకెట్లకు పైగా అవసరమవడం, అవసరం మేరకు రక్తం అందకపోవడంతో రోగులు అనేక అవస్థలు పడుతున్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రోగులు చెన్నై నగరానికి వెళ్ళవలసి వస్తుందన్నారు. సకాలంలో రక్తం అందక చిన్నపిల్లలు చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. ప్రభుత్వ రక్తనిధిని వెంటనే తెరిపించి సేవలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ విషయాలను రెడ్‌క్రాస్ ఛైర్మెన్, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ సమావేశంలో హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు కె.విజయభాస్కర్, మల్లిఖార్జుననాయదవ్, మనో ఫౌండేషన్ అధినేత షేక్ ముజీర్, శివయ్యనాయుడు, సర్వేపల్లి సేవాసమితి అధ్యక్షులు సుధీర్, రాయ్‌యూత్ అధ్యక్షులు ఆవుల పాండురంగయ్య, కరణం హజరత్‌నాయుడు, మోటివేటర్లు పాల్గొన్నారు.

# పేదలకు ఇబ్బందులు లేకుండా చూడండి

**- జడ్పీ ఛైర్మెన్**

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా నెల్లూరుజిల్లాలో కురుస్తున్న భారీవర్షాల వల్ల పేదలు ఇబ్బందులు పడకుండా చూడాలని నెల్లూరు జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం సూళ్లూరుపేటలోని వట్రపాళెంలో ముంపుకు గురైన ప్రాంతాలను జడ్పీ ఛైర్మెన్ రాఘవేంద్రరెడ్డి, సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పరిశీలించారు. ముంపువాసులకు ఏర్పాటు చేయాల్సిన పునరావాస ఏర్పాట్లపై చర్చించుకున్నారు. ఆర్టీసీ డిపో వద్ద జాతీయ రహదారిపై ట్రాఫిక్ అంతరాయం గురించి తెలుసుకున్నారు. చేపట్టే పనులకు సంబంధించి జడ్పీ నిధుల ద్వారా సాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపీ సిఇసి సభ్యుడు దబ్బల రాజారెడ్డి, గండవరం సురేష్‌రెడ్డి, ఫయాజ్ పాల్గొన్నారు.

# అయ్యప్ప దేవస్థానంలో వార్షిక మండల పూజలు



నెల్లూరు వేదాయపాలెంలో వున్న శ్రీ స్వామి అయ్యప్ప దేవస్థానంలో 29వ వార్షిక మండల పూజ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. సోమవారం ధ్వజారోహణతో అంకురార్పణ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ నెల 17 నుండి 27వరకు మండల పూజలు జరుగుతాయి. 28వ తేదీ నగరోత్సవం, 29వ తేదీ ఆరాట్టు ఉత్సవంతో మండల పూజలు సమాప్తమవుతాయి. ప్రతిరోజు మండల కాలమందు ఉదయం నుండి నిర్మాల్య దర్శనంతో ప్రారంభమై శ్రీవేలి ఉత్సవం, అభిషేకం, అన్నసంతర్పణ వితరణ తదితర కార్యక్రమాలు జరుగుతాయి. సాయంత్రం జరిగే కార్యక్రమాల్లో దీపారాధన, భగవతి సేవ, అత్తాళపూజ, శ్రీవేలి ఉత్సవం, పడిపూజ, హరివరాసన కీర్తనలతో పూజలు సమాప్తమవుతాయి. దేవస్థానంలో ప్రతిరోజూ పేదలకు, వృద్ధులకు, స్వాములకు, గర్భిణీ స్త్రీలకు దాతల సహాయసహకారాలతో నిత్య అన్నప్రసాద వితరణ జరుగుతుందని శ్రీస్వామి అయ్యప్ప సేవా సమాజం అధ్యక్ష కార్యదర్శులు పి.టి.రంగ రాజన్, జి.శేషగిరిరావు తెలిపారు.

# శైవక్షేత్రాల్లో కార్తీక శోభ

మహాశివునికి అత్యంత ప్రీతికరమైన కార్తీకమాసం సందర్భంగా నెల్లూరు జిల్లాలోని అన్ని శైవక్షేత్రాల్లో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరుస్తోంది. సైదాపురం మండలం కలిచేడుకు సమీపంలోని సిద్ధలయ్యకోన, కొడవలూరు మండలం గండవరంలోని శివాలయం, విడవలూరు మండలంలోని రామతీర్థం గ్రామంలో వెలసియున్న శైవక్షేత్రం, సీతారామపురం మండలం సమీపంలోని భైరవకోన, సోమశిల మల్లీశ్వరస్వామి దేవస్థానం కార్తీకశోభతో శోభిల్లుతున్నాయి. జిల్లా నలుమూలల నుంచే కాకుండా పొరుగు జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు ఈ దేవాలయాలను దర్శించుకుంటున్నారు.

## కార్తీక దీపాల వెలుగులు

కార్తీకమాసం తొలి సోమవారం శైవక్షేత్రాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల్లో కార్తీక దీపాలను శోభాయమానంగా భక్తులు వెలిగించారు. కార్తీకదీపాల కాంతులతో జిల్లాలోని శివాలయాలు ప్రత్యేకశోభను సంతరించుకున్నాయి. తొలి కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని భక్తులు పరమేశ్వరునికి అత్యంత ప్రీతి పాత్రమైన కార్తీకదీపాలను శివాలయంలో భక్తి శ్రద్ధలతో వెలిగించి కార్తీకమాస వ్రతాలను నిర్వహించారు. ఉదయం నుంచి ఎడతెరిపిలేని వర్షం కురుస్తున్నా భక్తులు పరమేశ్వరుని దర్శనానికి శివాలయాల్లో బారులు తీరారు. ప్రత్యేకపుష్పాలంకరణలు, విద్యుద్దీప కాంతులతో భక్తులతో సందడి వాతావరణం నెలకొంది. నెల్లూరు మూలాపేటలోని శ్రీ భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి వారికి భక్తులు పాలాభిషేకాలు, రుద్రహోమాలు, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో వున్న సుంద



రేశ్వరస్వామి ఆలయంలో మహిళాభక్తులు విశేషంగా పాల్గొని కార్తీక దీపాలను వెలిగించి నోములు నోచుకున్నారు. నెల్లూరు నగరంలోని పలు శివాలయాల్లో భక్తులు విశేషంగా పాల్గొని కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని పరమేశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

నెల్లూరుజిల్లాలోని అన్ని శైవక్షేత్రాల దర్శనార్థం జిల్లా ప్రజలకు పర్యాటక శాఖ ఆధ్వర్యంలో షటిల్ బస్సులను నడిపించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రముఖ శైవక్షేత్రాలను జిల్లా ప్రజలకే కాకుండా రాష్ట్రం నలుమూలల నుండి వచ్చే పర్యాటకులకు ఇది ఎంతో ఉపయోగంగా ఉంటుంది. జిల్లాలో వుండే శైవక్షేత్రాలను దర్శించుకునే భాగ్యాన్ని పర్యాటకశాఖ వీలైనంత త్వరగా కల్పిస్తుందని ఆశిద్దాం.

సింహపురి సమాచారం

## కలెక్టర్‌కు

# దళిత విద్యార్థిసేన కృతజ్ఞతలు

నెల్లూరుజిల్లాలో గత రెండు సంవత్సరాలుగా అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీలో డిగ్రీ, పిజి, జర్నలిజం కోర్సులకు సంబంధించిన ఆన్‌లైన్ సేవలు ఆగిపోవడంపై కలెక్టర్ స్పందించి కంప్యూటర్ సేవలను మరలా పునఃప్రవేశపెట్టినందుకు జిల్లా కలెక్టర్ యం.జానకికి దళిత సంఘాలు, దళిత విద్యార్థిసేన ఆధ్వర్యంలో కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు అరవ పూర్ణప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు.

# రోగులకు అల్పాహారం



నెల్లూరుజిల్లా ముస్లింయూత్ సేవా కమిటి ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, అల్పాహారం పంపిణీ చేసినట్లు కమిటి అధ్యక్షుడు ఖాలిద్ ఒక ప్రకటనలో తెలిపారు.

# జీతాలిప్పించండి మహాప్రభో...

గత ఏడు నెలలుగా నిలిచిపోయిన జీతాలను వెంటనే చెల్లించాలని ఏళ్ల తరబడి పని చేస్తున్న తమను రెగ్యులర్ చేయాలంటూ ట్రామా కేర్ ఉద్యోగులు సోమవారం నెల్లూరు దర్గామిట్ట పెద్దాసుపత్రి వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌కె రఫి మాట్లాడుతూ తాము 2010 నుంచి పని చేస్తున్నామని, ప్రభుత్వం తమకు సక్రమంగా జీతాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 24గంటల్లో ఏ సమయంలోనైనా ప్రమాదాలకు గురైన ప్రజలకు తాము సేవలందిస్తూ ప్రాణాలు నిలబెడుతున్నామన్నారు. అయినా ప్రభుత్వం తమను చిన్నచూపు చూస్తూ జీతాలు ఇవ్వడం లేదన్నారు. దీంతో తమ కుటుంబాలు పస్తులతో కాలం గడుపుతున్నారన్నారు. ఈ ఏడాది కాంట్రాక్టు కాలపరిమితి దాటి రెండు నెలలు కావస్తున్నా ఇంకా అగ్రిమెంటు తీసుకోకపోవడం అన్యాయమన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో ట్రామా కేర్ ఉద్యోగుల యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి సుష్మ, కోశాధికారి ఫణీధర్, టెక్నీషియన్లు శేఖర్‌బాబు, కవిత, ఖాదర్‌వలి, నారాయణస్వామి, సెల్వానాథం పాల్గొన్నారు.

# ఈ కాలుష్య కార్ఖానాలపై చర్యలు తీసుకోండి

ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న రైసు మిల్లుల కాలుష్యంపై చర్యలు తీసుకోవాలని, లేకుంటే కాలుష్య అధికారులను గ్రీన్ కోర్టుకు లాగుతానని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి హెచ్చరించారు. 14వ తేదీ నెల్లూరురూరల్ నియోజకవర్గ పరిధిలోని సౌత్‌రాజుపాలెంలో ఆయన కాలుష్య అధికారులతో కలసి పర్యటించారు. ఆ ప్రాంతంలోని రైసు మిల్లులను పరిశీలించి ఆ ప్రాంత ప్రజలను కాలుష్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలుష్యంతో వ్యాధులకు గురౌతున్నామని, అనేక వ్యాధులతో ఆసుపత్రుల పాలవుతున్నామని, ఎన్నిసార్లు కాలుష్య అధికారులతో చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన చెందారు. దీంతో ఆగ్రహించిన ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ రూరల్ నియోజకవర్గ పరిధిలో 34రైసు మిల్లులు ఉన్నాయని, ఈ రైసు మిల్లులు నిత్యం టన్నుల కొద్ది దుమ్ము, ధూళి కాలుష్యాలను విడుదల చేస్తున్నాయన్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని కాలుష్య అధికారులపై గ్రీన్‌కోర్టులో కేసు వేస్తానన్నారు. దీంతో అక్కడే వున్న కాలుష్య అధికారులు 34 రైసు మిల్లులకు ప్రాథమికంగా నోటీసులు ఇచ్చామని తెలిపారు.

# వరిసాగులో యాంత్రీకరణ పద్ధతులు

వరిసాగులో యాంత్రీకరణ పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు వేణుకృష్ణ అన్నారు. వ్యవసాయ పరిశోధనం నెల్లూరు, సుమిటోమా కంపెనీ(జపాన్) వారి ఆధ్వర్యంలో నెల్లూరుజిల్లా ఇందుకూరుపేటలో సోమవారం పరిశోధనలు, ప్రదర్శన కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వేణు కృష్ణ మాట్లాడుతూ వరిలో అధిక దిగుబడులు సాధించేందుకు ఎన్జీ రంగా వ్యవసాయ విద్యాలయం, సుమిటామో సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ పిడి విజయభారతి, నెల్లూరు పరిశోధన శాస్త్రవేత్తలు రాజన్, రమేష్, రాజశేఖర్, వనిత, ఏఓ నాగేశ్వరరావు, ఎంపిఇఓలు తిరుమలరావు, హరిబాబు పాల్గొన్నారు.

# శ్రీ బాలత్రిపుర సుందరి ఆలయంలో విశేషపూజలు

నెల్లూరుజిల్లా రూరల్ పరిధిలోని పెద్దచెరుకూరు గ్రామంలో వెలసియున్న శ్రీ బాలత్రిపుర సుందరి సమేత శ్రీ చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం మొదటి సోమవారం సందర్భంగా విశేషపూజలు జరిగాయి. ఆలయ ప్రధానార్చకులు నూతలపాటి సుబ్బయ్య శాస్త్రి, పరమేశ్వరశాస్త్రి ఆధ్వర్యంలో ఉదయం నుంచి స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, 18రకాల విశేషహారతులు నిర్వహించారు. సాయంత్రం పూలంగిసేవ, పల్లకి సేవ కనుల పండువగా జరిగింది.

కొత్తూరు ప్రాంతంలోని చిన్మయామిషన్‌లో స్వామి నిర్మలానంద ఆధ్వర్యంలో మహిళా భక్తులు విశేషంగా పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మలానంద మాట్లాడుతూ కార్తీకమాసం దీప ప్రకాశానికి ఎంతో ప్రాధాన్యతనిస్తుందన్నారు.




భారీ వర్షాలు పడితే నెల్లూరు నగరం రెండుగా చీలిపోతుంది. రైల్వేట్రాక్‌కు తూర్పు, పడమర వుండే ప్రాంతాలు వేరుపడతాయి. ఒక ప్రాంతంతో ఇంకో ప్రాంతానికి సంబంధాలుండవు. అటు ఇటు రాకపోకలు నరకప్రాయంగా మారుతాయి. దీనికి కారణం రైల్వేట్రాక్‌కు తూర్పు, పడమర ప్రాంతాలను కలుపుతూ ఒక్క ఫ్లైఓవర్ బ్రిడ్జి కూడా లేకపోవడమే.

# ఇప్పటికైనా 'ఫ్లైఓవర్' అవసరం గుర్తిస్తారా?

భారీ వర్షాలకు నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండ్, విజయ మహల్‌గేట్, రామలింగాపురం, మాగుంట లే అవుట్ అండర్ బ్రిడ్జిలు నీళ్లతో నిండిపోయాయి. నగరంలో తూర్పు, పడమర ప్రాంతాలకు రాకపోకలకు ఇవే ప్రధాన మార్గాలు. రామలింగా పురం అండర్ బ్రిడ్జి వద్దయితే ఆనం వెంకటరెడ్డి విగ్రహం వరకు వరద నీళ్లు తన్నుకొచ్చాయి. ఇక నగరంలో రాకపోకలకు వున్న మార్గమల్లా బి.వి.నగర్, కొండాయపాలెం, రంగనాయకుల పేట రైల్వే గేట్లే! నగరంలోని వాహనాలన్నీ ఇలాంటి సమయంలో ఈ రూట్లలో రావడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. అయ్యప్పగుడి వద్ద రైల్వే ట్రాక్‌పై ఫ్లై ఓవర్ వంతెన వున్నప్పటికి అది నగరానికి చివర ఉండడంతో పెద్దగా ఉపయోగపడడం లేదు.

మాగుంట లే అవుట్‌లో అప్పుడే అండర్‌బ్రిడ్జి బదులు ఫ్లైఓవర్ కట్టి వుంటే ఈరోజు ఇంత సమస్య ఉండేది కాదు. నగరం మధ్యలో రైల్వేట్రాక్ మీద ఒక్క ఫ్లైఓవర్ కూడా లేక పోవడం పలు సమస్యలకు దారితీస్తుంది.

భారీ వర్షాల నేపథ్యంలో అండర్‌బ్రిడ్జిలన్నీ నీళ్లతో నిండి పోయాయి. ఇలాంటి సమయంలో ఫ్లైఓవర్ వంతెన అవసరమన్న విషయాన్ని మన పాలకులు గుర్తించాలి. జిల్లా వాసులుగా కేంద్రంలో వెంకయ్యనాయుడు, రాష్ట్రంలో పి.నారాయణ మంత్రులుగా వున్నారు. ఇద్దరివీ పట్టణాభివృద్ధి శాఖలే! నగరానికి ఒకటి, రెండు ఫ్లై ఓవర్ వంతెనలు మంజూరు చేయించడం వీరికి పెద్ద లెక్కలోని పని కాదు. మరోసారి ఇలాంటి వర్షం బారిన పడి నెల్లూరు ప్రజలు బాధలు పడకముందే నగరంలో ఫ్లైఓవర్‌ల నిర్మాణానికి మంత్రులిద్దరూ కృషి చేస్తే నెల్లూరు ప్రజల మన్ననలందుకుంటారు.


ఈ నెల 15వ తేదీన నెల్లూరుకు విచ్చేసి డా॥ నాగభైరవ అవార్డును స్వీకరించిన సినీ రచయిత, నటులు గొల్లపూడి మారుతీరావును కలిసి అభినందనలు తెలుపుతున్న నెల్లూరుజిల్లా ఎస్పీ డా॥ గజరావ్ భూపాల్

# వంతెన పునరుద్ధరణ పనుల్లో మంత్రులు



భారీవర్షాలతో అతలాకుతలమైన నెల్లూరుజిల్లాలో రిజర్వాయర్‌లు, చెరువుల పరిస్థితిని స్వయంగా పరిశీలించేందుకు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు బుధవారం జిల్లాకొచ్చారు. అలాగే రాష్ట్ర రవాణాశాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి సిద్ధా రాఘవరావు, రాష్ట్ర మున్సిపల్ శాఖామంత్రి పి.నారాయణలు వరద పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు. ఈ ముగ్గురు మంత్రులు మనుబోలు వద్ద వరద ఉధృతకు తెగిన జాతీయ రహదారి పునరుద్ధరణ పనులు స్వయంగా పరిశీలించారు. సిద్ధా రాఘవరావు ప్రత్యేక చొరవ తీసుకుని వందలాది ట్రక్కులలో చీమకుర్తి నుండి బోల్డర్స్‌ను తెప్పిస్తూ వంతెన మరమ్మత్తు పనులను అక్కడేవుండి పరిశీలిస్తున్నారు. ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కూడా ఈ వంతెన పనుల వద్దే వుండడం విశేషం.

# గ్రహణమొర్రికి ఉచిత శస్త్ర చికిత్సలు

## • నెల్లూరులో అరుదైన వైద్యశిబిరం



గ్రహణమొర్రికి ఉచితంగా శస్త్ర చికిత్సలు నిర్వహించేందుకు ముత్తూట్ ఫౌండేషన్ సహకారంతో చెన్నై స్పెషలిస్ట్ వైద్య బృందం సేవలను అందిస్తుందని నెల్లూరుజిల్లా వాసి చెన్నైలోని ప్రముఖ వైద్యులు సిఎంకె రెడ్డి కుమారుడు చెన్నై రోటరీక్లబ్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ సిఎం కిషోర్‌రెడ్డి తెలిపారు. 14వ తేదీ నెల్లూరు పొగతోటలోని కేర్ సూపర్ స్పెషాలిటీ దంత వైద్యశాలలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ పాండిచ్చేరిలోని న్యూ మెడికల్ సెంటర్‌లో చీలిన పెదవులు, అంగిట్లో మొర్రి, పుట్టుకతో ఏర్పడే జన్యు వైఫల్యం కలవారికి వయస్సుతో నిమిత్తం లేకుండా ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తారన్నారు.

### 30న ఉచిత వైద్య పరీక్షలు

ఈనెల 30వతేదీ సోమవారం నెల్లూరు పొగతోటలోని కేర్ సూపర్ స్పెషాలిటి దంత వైద్యశాల ప్రాంగణంలో బాధితులను పరీక్షించి అర్హులను శస్త్ర చికిత్సకు ఎంపిక చేస్తామన్నారు. బాధితులు ఎంత మంది వచ్చినా ఉచితంగా చికిత్సలు చేస్తామన్నారు. రోగితో పాటు సహాయకులకు ప్రయాణఖర్చులు, వసతి, భోజనం, ఆపరేషన్ ఖర్చులు యావత్తు ముత్తూట్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహిస్తామన్నారు. తొలుత ఈ వైద్య పరీక్షలు ఈ నెల21న జరగాల్సివుండగా భారీవర్షాల కారణంగా 30వ తేదీకి వాయిదా పడింది. వైద్య శిబిరంలో పాల్గొనదలచిన వారు 92470 05757 నంబరులో సంప్రదించి పేరు నమోదు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో కేర్ సూపర్ స్పెషాలిటి దంత వైద్యశాల అధినేత ఆలూరు స్వరూప్ కుమార్‌రెడ్డి, మిషన్ స్మైల్ ఆర్గనైజేషన్ నిర్వాహకులు రఫి, ఓఎంఎఫ్ ఎక్స్ సర్జన్ డాక్టర్ శక్తివేల్, రాంప్రసాద్ పాల్గొన్నారు.

# బాధితులను ఆదుకోవడంలో విఫలం



వరద బాధితులకు సాయం అందించడంలో అధికారయంత్రాంగం పూర్తిగా విఫలమైందని సర్వేపల్లి ఎమ్మెల్యే, వైయస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి విమర్శించారు. బుధవారం వరద తాకిడి ప్రాంతాలను ఆయన సందర్శించారు. వెంకటాచలం వద్ద జాతీయ రహదారిపై మోకాళ్ల లోతులో వున్న వరద నీటిలో వెళ్లి వడ్డిపాలెం గ్రామస్తుల బాధలు అడిగి తెలుసుకున్నారు. నక్కల కాలువ నుంచి తిరులమ్మపాళెం, గుడ్లూరివారిపాలెం గ్రామాలకు భోజనం అందించే రిస్క్యూటీంతో మాట్లాడి సహాయ చర్యలు ముమ్మరం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా డ్వామా పిడి చంద్రమౌళి, తహశీల్దార్ సుధాకర్‌కు పలు సూచనలు చేసారు. కట్టంరెడ్డి విజయ మోహన్‌రెడ్డి తయారు చేయించిన ఆహార పొట్లాలను ఉన్నత పాఠశాలలో వున్న వరద బాధితులకు పంపిణీ చేశారు. కాకాణి మాట్లాడుతూ ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించని కారణంగా సర్వేపల్లి రిజర్వాయర్ నీరు వృధాగా సముద్రం పాలవడంతో పాటు పలు గ్రామాలు ముంపునకు గురయ్యాయన్నారు. అనేకమంది ఆక్వా రైతులు కోట్ల రూపాయలు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. జడ్పీటీసీ సభ్యుడు మాదాల వెంకటశేషయ్య, కనుపూరు కోదండయ్య, కట్టంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

## సొంత ఖర్చుతో

# పూడిక తీయించిన కార్పొరేటర్



నెల్లూరు నగరం 8వ డివిజన్‌లో ఆ డివిజన్ కార్పొరేటర్ డాక్టర్ జడ్.శివప్రసాద్ తన సొంత ఖర్చుతో కాలువల్లోని పూడిక తీయించారు. ప్రొక్లెయిన్‌ను పెట్టి పూడిక తీయించి వరద నీళ్లు ఇళ్లల్లోకి రాకుండా చేసారు. వర్ష బాధితులకు ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. అలాగే వర్షాల నేపథ్యంలో అంటు వ్యాధులు ప్రబలకుండా ఇక్కడ వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట టిఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు కె.తిరుమలనాయుడు, అమృల్లా, సుందరరామ్మూర్తి, కార్పొరేషన్ డిఇ వెంకటేశ్వర్లు, ఏఇ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

# మైథిలి స్కూలులో బాలల దినోత్సవం



నెల్లూరు వేదాయపాలెం చంద్రమౌళినగర్‌లో వున్న మైథిలి స్కూలులో 14వ తేదీ భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ 125వ జయంతిని పురస్కరించుకుని బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాల వ్యవస్థాపకులు మైథిలి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ నెహ్రూ సామ్యవాదం, లౌకికతత్వం సిద్ధాంతాలు ఎప్పటికీ ఆచరణీయమని విద్యార్థులు తమ బాధ్యతలను తెలుసుకున్నప్పుడే భారతదేశానికి నిజమైన వారసులుగా నిలబడతారన్నారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్, డైరెక్టర్ ఫణీంద్రుడు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## 'ప్రభా'తం

# ఉగ్ర భూతంపై ఉమ్మడి సమరం

కాలనాగు ఏ దేశంలో వున్నా ఎవరిని కాటేసినా విషం ఎక్కే విధానం ఒకే రీతిలో వుంటుంది. అమెరికాలో వుండే పాములు ఒక రకంగాను, ఇండియాలో వుండే పాములు ఇంకోరకంగానూ కాటేయవు. ఉగ్రవాదులూ అంతే! అమెరికాలో ఒకరకంగా, ఇండియాలో ఇంకో రకంగా, పాకిస్థాన్‌లో మరో రకంగా ఉండరు. ఉగ్రవాదం లక్ష్యం మానవ హననం, రక్తపాతమే! దానికి కులమతాల హద్దులు, దేశాల సరిహద్దులు అనేవి వుండవు. ప్రపంచం భారతదేశంలో జరిగిన ఉగ్రదాడులకు ఒకరకంగా, అమెరికా, బ్రిటన్ దేశాలలో జరిగిన దాడులకు ఇంకోరకంగా స్పందిస్తుంటే ఉగ్రవాదాన్ని అంతం చేయడం కాదుకదా, దాని దరిదాపుల్లోకి కూడా పోలేరు. ఇప్పుడు ప్రపంచం రెండుగా చీలిపోవాల్సిన అత్యవసర పరిస్థితి ఏర్పడింది. ఒకటి ఉగ్రవాదం బారిన పడిన ప్రపంచమైతే, ఇంకోటి ఉగ్రవాద సంస్థలు, వాటికి ఆశ్రయమిస్తున్న దేశాలు మరో ప్రపంచంగా మారాయి.

ఉగ్రవాదం మళ్లీ బుసలు కొట్టింది. మతం పేరుతో మారణ హోమానికి తెగబడింది. ఈ నెల 14వ తేదీన ప్రపంచానికే నిద్రలేకుండా చేస్తున్న ఐసిస్ ఉగ్రవాద సంస్థ ఈసారి ఫ్రాన్స్‌పై విరుచుకుపడింది. పారిస్‌లో జరిపిన దాడుల్లో 129మందిని పొట్టన పెట్టుకుంది. పారిస్ దాడి 26/11 ముంబై దాడిని తలపించింది. పారిస్ దాడితో ప్రపంచమే ఒక్కసారి నివ్వెరపోయింది. ముఖ్యంగా యూరోపియన్ దేశాలలో వణుకు మొదలైంది. ఇస్లాం రాజ్యస్థాపన లక్ష్యంగా ఏర్పడిన ఐఎస్ఐఎస్ ఉగ్రవాద మూక పారిస్ దాడికి పాల్పడింది. భవిష్యత్‌లో మరిన్ని దేశాలకు, మరిన్ని నగరాలకు ఈ దాడి ఓ హెచ్చరికగా, ఓ సంకేతంగా మారింది.

సిరియా కేంద్రంగా ఏర్పడ్డ ఐసిస్ ఉగ్రవాద సంస్థ చేస్తున్న క్రూరత్వ చర్యలు చూస్తే ఎవరికైనా వెన్నులో వణుకు పుట్టాల్సిందే! బందీల తలలు నరకడం, నిలువునా సజీవ దహనం చేయడం, ఈ దృశ్యాలను సామాజిక మాధ్యమాలలో పెట్టి ప్రపంచానికి చూపించడం వంటివి ఇటీవల కాలంలో ఎక్కువయ్యాయి. గతంలో ఎన్నో ఉగ్రవాద సంస్థలు పనిచేసాయి. ఆల్‌ఖైదా, తాలిబన్, లష్కర్‌తోయిబా, జైషేఅహ్మద్, ఎల్‌టిటిఇ, ఖలిస్థాన్ వంటి ఉగ్రవాద సంస్థలు బాంబులతో, తుపాకులతో మారణహోమాలు సృష్టించేవి. ఐసిస్ మాత్రం అత్యంత పాశవికంగా మనుషులను చంపడం మొదలుపెట్టింది. సిరియాలో చెలరేగిన అంతర్యుద్ధంతో అక్కడి ప్రజలు సగానికి పైగా యూరప్ దేశాలకు వలసపోవడం జరిగింది. పారిస్ దాడితో పేట్రేగుతున్న ఉగ్రవాద చర్యలపై ప్రపంచ దేశాలన్నీ ఏకం కావాల్సిన అవసరం వుందనే సత్యం అవగతమవుతోంది.

భారత ప్రధాని నరేంద్ర మోడీ ఉగ్రవాదంపైనే ప్రపంచ దేశాలన్నింటిని ఏకతాటిపైకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఆయన ఏ దేశంలో పర్యటించినా మొదటి సందేశం ఉగ్రవాదం మీద సమిష్టి సమరంతోనే మొదలవుతోంది. ఇప్పటికే ఉగ్రవాదంపై పోరుకు ఆయన మెజార్టీ దేశాల మద్దతు కూడగట్టగలిగారు.

ఇప్పటివరకు ఉగ్రవాదంపై పోరులో అగ్రరాజ్యాలు సహా ప్రధాన దేశాలన్నీ తలో దారిన నడవసాగాయి. ఉగ్రవాదంపై ఉమ్మడిపోరుకు ఒక వేదికే లేకుండాపోయింది. అమెరికాలో ఆల్‌ఖైదా వరల్డ్ ట్రేడ్ సెంటర్ భవనాలను కూల్చినప్పుడు మాత్రం ఆ దేశం స్పందించింది. ఆల్‌ఖైదా అధినేత బిన్‌లాడెన్‌ను వెంటాడి చంపింది. ఆఫ్ఘనిస్థాన్‌లో తాలిబన్‌లను తుదముట్టించింది. కాని ప్రపంచానికి నేతృత్వం వహిస్తున్న అమెరికా వంటి అగ్రరాజ్యం తమ దేశంలో దాడిని ఎంత సీరియస్‌గా తీసుకుందో, ప్రపంచంలో ఏ దేశంలో జరిగిన దాడినైనా అంతే సీరియస్‌గా తీసుకుని వుండాలి. కాని అమెరికా అలా చేయలేదు. ఉగ్రవాద దాడులకు బలైన దేశాలలో మొదటి స్థానంలో భారత్ వుంటుంది. ఉగ్రవాద కోరలకు ఇక్కడ లక్షలమంది బలయ్యారు. ప్రాణనష్టం, ఆర్థిక నష్టం అంచనాలకు అందనిది. భారత్‌లో ఉగ్రవాద చర్యలన్నీ పాకిస్థాన్ ప్రేరేపితమైనవే! భారత్‌లో ఉగ్ర కార్యకలాపాలు జరిపే ప్రతి సంస్థ ఉండేది ఆ దేశంలోనే! 1992 నాటి ముంబై దాడుల సూత్రధారి దావూద్ ఇబ్రహీం వంటి మాఫియాడాన్‌కు ఆశ్రయం కల్పిస్తున్నది పాకిస్థానే! ఆక్రమిత కాశ్మీర్ కేంద్రంగా ఉగ్రశిక్షణ శిబిరాలున్నాయి. అమెరికా అందిస్తున్న ఆర్థిక సహకారాన్ని పరోక్షంగా పాకిస్థాన్ ఉగ్రవాద కార్యకలాపాలకు ఉపయోగిస్తుంది. ఉగ్రసంస్థలకు సహకారం అందిస్తున్న దేశాలలో పాకిస్థాన్ అగ్రస్థానంలో నిలుస్తోంది. కాని ఆ దేశాన్ని దారికితెచ్చే ప్రయత్నాలేవీ అమెరికా చేయడం లేదు. పాకిస్థాన్‌కు ఆ విధంగా హెచ్చరికలు కూడా ఇవ్వడం లేదు.

ప్రపంచంలో ఈరోజు ఉగ్రవాద పోకడలకు బీజం వేసింది అగ్రరాజ్యమే! ఆయా దేశాలలో తమకు గిట్టని ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఉగ్రసంస్థలను పుట్టించింది అగ్రరాజ్యమే! వారికి ఆయుధాలు అందించింది ఆ దేశమే. ఉగ్రవాద కార్యకలాపాలను పెంచడం ద్వారా తమ ఆయుధ వ్యాపారాన్ని మెరుగుపరుచుకుంది కూడా ఆ అగ్రరాజ్యమే! ఆల్‌ఖైదా, ఐసిస్ వంటి ఎన్నో ఉగ్రసంస్థలు పుట్టడానికి కారణం అమెరికానే! ఇరాక్, ఆఫ్ఘనిస్థాన్, లెబనాన్, లిబియా, సిరియా వంటి దేశాలలో రాజకీయ సంక్షోభానికి కారణం అమెరికానే! తదనంతర పరిణామాలన్నీ వాళ్ల పుణ్యమే!

గతంలో అగ్రరాజ్యాలు చేసిన పాపాలే ఈరోజు ప్రపంచాన్ని ఉగ్రవాదం రూపంలో శాపమై పీడిస్తున్నాయి. ఉగ్రవాదంపై ఉమ్మడిపోరు సంస్కృతికి ఐక్యరాజ్య సమితియే నేతృత్వం వహించాల్సివుంది. ఉగ్రవాదానికి మతం లేదన్న విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తించాలి. ఉగ్రవాదంపై ఉమ్మడిపోరు లక్ష్యంతో అన్ని దేశాలు కూడా దీని నిర్మూలనకు ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలి. వీలైనంత తొందరలో ఈ ఉగ్రవాదాన్ని అంతం చేయకుంటే మానవ ప్రపంచాన్ని అది అంతం చేసే ప్రమాదముంది.



ప్రపంచంలో ఈరోజు ఉగ్రవాద పోకడలకు బీజం వేసింది అగ్రరాజ్యమే! ఆయా దేశాలలో తమకు గిట్టని ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఉగ్రసంస్థలను పుట్టించింది అగ్రరాజ్యమే! వారికి ఆయుధాలు అందించింది ఆ దేశమే. ఉగ్రవాద కార్యకలాపాలను పెంచడం ద్వారా తమ ఆయుధ వ్యాపారాన్ని మెరుగుపరుచు కుంది కూడా ఆ అగ్రరాజ్యమే! ఆల్‌ఖైదా, ఐసిస్ వంటి ఎన్నో ఉగ్రసంస్థలు పుట్టడానికి కారణం అమెరికానే! ఇరాక్, ఆఫ్ఘనిస్థాన్, లెబనాన్, లిబియా, సిరియా వంటి దేశాలలో రాజకీయ సంక్షోభానికి కారణం అమెరికానే! తదనంతర పరిణామాలన్నీ వాళ్ల పుణ్యమే!

### నెల్లూరీయులకు
# కళామిత్ర ప్రతిభా పురస్కారాలు



ఒంగోలు కళామిత్ర మండలి వారి 9వ వార్షికోత్సవం ఈ నెల 15వ తేదీ ఒంగోలు సివియస్ రీడింగ్ రూంలో మండలి అధ్యక్ష కార్యదర్శులు డా॥ వంకాయలపాటి రామకృష్ణ డా॥ నూనె అంకమ్మరావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఏపి ప్రజానాట్య మండలి గౌరవాధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు, కృష్ణాజిల్లా రచయితల సంఘం అధ్యక్షులు గుత్తికొండ సుబ్బారావు, ప్రకాశం జిల్లా రచయితల సమాఖ్య ప్రధానకార్యదర్శి కుర్రా ప్రసాద్‌బాబు, సీనియర్ సివిల్ జడ్జి, ఒంగోలు జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి వి.మోహన్‌కుమార్, ప్రముఖ కవయిత్రి తేళ్ల అరుణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయిలో 13జిల్లాలలో సంగీత సాహిత్య సామాజిక సేవా, చిత్రకళ రంగాలలో విశేష ప్రతిభ కనపరచిన 12మందికి కళామిత్ర ప్రతిభా పురస్కారాలు అందజేశారు. వీరిలో నెల్లూరుజిల్లాకు చెందిన నెల్లూరుజిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి పాతూరి అన్నపూర్ణను "కవితా శిరోమణి" బిరుదుతో, పెన్నా రచయితల సంఘం వ్యవస్థాపక ప్రధానకార్యదర్శి గుండాల నరేంద్ర బాబును 'సాహిత్య సేవారత్న' బిరుదుతో శాలువ, జ్ఞాపిక, సన్మానపత్రం, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారిని జిల్లాలోని సాహిత్యాభిమానులు అభినందించారు.

# గీతామయిలో బాలల దినోత్సవం



నెల్లూరు బాలాజీనగర్‌లో వున్న గీతామయి వృద్ధుల ఆశ్రమంలో ఈ నెల 14వతేదీన బాలల దినోత్సవ వేడుకలు జరిగాయి. ఏసి నగర్‌లోని ఎంఎస్‌ఎం స్కూలు విద్యార్థుల ఆధ్వర్యంలో ఆశ్రమంలోని వృద్ధులకు వస్త్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ వ్యవస్థాపకులు తమ్మినేని పాండు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# చదవడానికే వికారంగా వుంది

ఇటీవల ఓ దినపత్రికలో ఆకార్‌పటేల్ "ఈ పోరాట యోధుడు కూడా దేశ ద్రోహేనా?" అంటూ టిప్పుసుల్తాన్‌ను కీర్తిస్తూ ఒక వ్యాసం వ్రాసారు. ఇలాంటి వాళ్లంతా మేధావులుగా ఎందుకు పరిగణించబడతారో అర్థమేకాదు. టిప్పుసుల్తాన్ తన రాజ్యాన్ని కాపాడుకోవడానికి, తన కిరీటాన్ని కాపాడుకోవడానికి బ్రిటీష్ వారితో పోరాడాడు. అంతేగాని దేశం తరపున స్వాతంత్ర్య పోరాటం చేయలేదు. ఇక్కడ టిప్పు సుల్తాన్‌కు, ఆంగ్లేయులకు పెద్ద తేడా లేదు. ఆంగ్లేయులన్నా ఇంకా మతం పేరుతో హిందువులను హింసించలేదు. కాని టిప్పు సుల్తాన్ మతమౌఢ్యుడు. హిందువులను ఊచకోత కోయించాడని చరిత్ర చెబుతోంది. పటేల్ తన వ్యాసంలో అశోకుడు కూడా కళింగ యుద్ధంలో సాటి హిందువులను చంపాడని, అంత మాత్రాన అశోకుడిని ద్వేషిస్తామా? అని ప్రశ్నించారు. ఆయనది అజ్ఞానమో, విజ్ఞానమో అర్థం కావడం లేదు. భారత ఖండంలో చిన్నచిన్న రాజ్యాల మధ్య యుద్ధాలు జరిగాయి. ఆ రాజ్యాలలో వున్నదంతా హిందూయిజమే. ఇక్కడ మతం పేరుతో యుద్ధాలు జరగలేదు. కేవలం రాజ్యాల కోసమే యుద్ధాలు జరిగాయి. ఈ దేశంలో మతపరమైన దాడి అనేది మహ్మదీయుల దురాక్రమణ నుండే మొదలైంది. ఇలాంటి వ్యాసాలు వ్రాసే ముందు ఇంగితజ్ఞానంతో ఆలోచించాలి.

**– సి.నరసింహారావు, తెనాలి.**

# తిరుపతి లడ్డూ ధర పెంచరాదు

ఇటీవల తితిదే పాలక కమిటీ భక్తులకు అద్దెకిచ్చే రూములు, లడ్డు ఇతరత్రా ధరలు పెంచాలని నిర్ణయించడం శోచనీయం. తిరుమల తిరుపతి దేవస్థానానికి నిధుల కొరత లేదు. విరాళాలకు కొరత లేదు. దాతలకు కొరత లేదు. ఈ సొమ్మంతా తిరుమలేశుని మీద భక్తితో భక్తులు కానుకలుగా సమర్పించేవే గదా! ఇప్పటికే లడ్డు నాణ్యత ఇదివరకటికంటే క్షీణించిందని అందరూ వాపోతున్నారు. సైజు తగ్గింది. భక్తులు ప్రసాదంగా భావించే ఆ లడ్డు ధరను ఇంకా పెంచాలనుకోవడం భావ్యం కాదు. రూములు అద్దెలాంటివి సామాన్యులకు భారం కాకుండా కొద్దిగా పెంచినా ఫరవాలేదు గాని, ఆ స్వామివారి ప్రసాదం లడ్డు ధరను పెంచడం సబబుగాదు. లడ్డు సైజును పెంచండి. పూర్వపు నాణ్యతను తీసుకురండి. పాలకవర్గం అట్టి నిర్ణయాలు తీసుకుంటే ఏడుకొండలవాడు వారిని హర్షిస్తాడు.

**ఎం.శ్రీనివాసరావు, నెల్లూరు.**

# చదువుకున్న మూర్ఖులు

కొందరు పైకి మేధావులుగా కనిపిస్తారు. కాని వాళ్ల మాటలు, చేతలు మూర్ఖులకన్నా అధ్వాన్నంగా వుంటాయి. కన్నడ నటుడు గిరీష్‌కర్నాడ్ టిప్పుసుల్తాన్‌ను ఛత్రపతి శివాజీతో పోల్చాడు. శివాజీ ముందు దిష్టి తీయడానికి కూడా పనికిరాడు టిప్పుసుల్తాన్. మత సహనం పాటించి శత్రువులతో వీరోచితంగా పోరాడిన శివాజీ ఎక్కడ? మతమౌఢ్యంతో హిందువులను క్రూరంగా చంపించిన టిప్పుసుల్తాన్ ఎక్కడ! పోల్చి చూసే వాళ్లకు కొంచెమన్నా తలకాయ ఉండాలి.

**సి.రాజీవి, నెల్లూరు.**

# పార్టీని మూసేసుకో!

ప్రశ్నించడానికే జనసేన పార్టీని పెట్టానంటాడు పవన్ కల్యాణ్. అయితే నరేంద్రమోడీని, చంద్రబాబును ప్రశ్నించడానికి ప్రశ్నలే దొరకనట్లు ఫేస్ పెడుతున్నాడు. ప్రత్యేకహోదా ఇవ్వనని నరేంద్ర మోడీ అంటే ప్రశ్నించడేం? చంద్రబాబు రాజధాని పేరుతో పొలాలను నాశనం చేస్తుంటే, బాక్సైట్ గనులను తవ్వుతుంటే, పట్టిసీమతో అవినీతిని పారిస్తుంటే, ఇసుక అక్రమాలకు పాల్పడుతుంటే ఈ పవన్ ప్రశ్నించడేం! నోరు మూతపడిపోయిందా?

**– షేక్ జిలాని, తిరుపతి.**

• దేశంలో ఆనం

# పార్టీలో మొదలైన అలజడి ఆందోళన

*ఆనం రామనారాయణరెడ్డి కాంగ్రెస్‌ను వదలడం, తెలుగుదేశంలో చేరడం ఇంకా ఖాయం కాలేదు. కాని ఆయన తెలుగుదేశంలో చేరుతాడన్న ఊహాగానాలు మాత్రం ఆ పార్టీ జిల్లా నాయకులకు మింగుడు పడడం లేదు. బలమైన నాయకులు పార్టీలోకి వస్తామంటే ఆహ్వానించండంటూ చంద్రబాబు చెప్పిన మాటలు జిల్లా నాయకులకు పుండు మీద కారం చల్లినట్లున్నాయి.*








పార్టీలను పక్కనపెడితే ఇప్పుడున్న రాజకీయ కుటుంబాలలో పెద్దది, సీనియర్ కుటుంబం ఆనందే! ఆ కుటుంబంలో వయసుకు వివేకా పెద్దోడైనప్పటికి రాజకీయంగా రామనారాయణరెడ్డి అనుభవజ్ఞుడు. ఆయన తెలుగుదేశంలో చేరాడంటే ఆనం కుటుంబం అంతా కూడా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఆ పార్టీలో వున్నట్లే! పార్టీలో వారి ఆధిపత్యం పెరగడం ఖాయం. జిల్లా కాంగ్రెస్ దిగ్గజం నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి వర్గాన్నే నిర్వీర్యం చేసి పైచేయి సాధించిన ఘనులు ఆనం సోదరులు. ఇక జిల్లా తెలుగుదేశంలో వుండే నాయకులెవరూ వారికి పెద్ద లెక్కలోకి రారు.

2014 ఎన్నికల తర్వాత కాంగ్రెస్ నుండి వాకాటి నారాయణ రెడ్డి మెట్టుకూరు ధనుంజయరెడ్డి, ఆనం జయకుమార్‌రెడ్డి, నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి వంటి నాయకులు వస్తే తెలుగుదేశంలోకి తీసుకున్నారు. వీరివల్ల ఏ నాయకుడికి కూడా ఇబ్బంది లేదు. వీళ్ళు వర్గ రాజకీయాలు చేసే స్థాయి నాయకులు కాదు. కాని ఆనం రామనారాయణరెడ్డి పరిస్థితి వేరు. ఆయన పార్టీలో చేరడం అంటూ జరిగితే ఆధిపత్యం కోసం ప్రయత్నిస్తాడు. మంత్రి నారాయణకు ఆనంతో వచ్చే ఇబ్బందేమీ వుండదు. ఎందుకంటే ఈయన వర్గ రాజకీయాలు నడిపేదేమీ లేదు. ఎక్కడన్నా పోటీ చేయాలన్న తపన లేదు. పబ్లిక్‌తో సంబంధం లేదు. పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తే చంద్రబాబు మంత్రి పదవి ఇస్తే తీసుకుంటాడు. లేకపోతే కాలేజీలు చూసుకుంటుంటాడు. ఆనంతో ఇబ్బందల్లా నెల్లూరు నగరం, రూరల్, ఆత్మకూరు, సర్వేపల్లి నియోజకవర్గాలలో వుండే నాయకులకే! సర్వేపల్లిలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పెత్తనం వుంది. రాజకీయంగా జిల్లాలో తెలుగుదేశంకు ఆయనే సీనియర్ నాయకుడు. పెద్ద వర్గమున్న నాయకుడు కూడా! ఆనం చేరితే మొదటి సవాల్‌ను ఎదుర్కోబోయేది సోమిరెడ్డే! ప్రస్తుతానికైతే చంద్రబాబు వద్ద బీద సోదరులకు ప్రాధాన్యత వుంది. ఆనం వస్తే కొంత తగ్గే అవకాశం కూడా వుంది. ఇక నెల్లూరు నగరంలో కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, రమేష్‌రెడ్డి, కిలారి వెంకటస్వామి నాయుడు వంటి నాయకులకు ఆనంతో పడదు. రామనారాయణ రెడ్డి పార్టీలో చేరితే నగరంలో ఆనం ఆధిపత్యం మొదలవుతుంది. అప్పుడు వీళ్లంతా కూడా డమ్మీలుగా మారే అవకాశాలున్నాయి. ఆనం రామనారాయణరెడ్డి తెలుగుదేశంలో అంటూ చేరడం జరిగితే ఆ పార్టీ జిల్లా నాయకులు చాలామందికి నిద్ర కరువవడం ఖాయం. ఇక పార్టీలో మరో కీలకవ్యక్తి 'ఆదాల'. ఆయనకు ఆనంతో పెద్దగా ఇబ్బందేమీ వుండకపోవచ్చు. తన జోలికి రానంతవరకు ఆయన ఎవరితోనూ విభేదాలకు తావివ్వడు. నిజంగా ఆనం తెదేపాలోకి వస్తే ఇప్పటికే ముగ్గురు నాయకులు ఆరు వర్గాలుగా వున్న పార్టీకి మరో తలనొప్పి మాత్రం ఖాయం.

# అవుట్ లెట్లు లేకనే ఈ అగచాట్లు

**- కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి**

నెల్లూరు నగరంలో పంట కాలువలన్నీ డ్రైనేజీ కాలువలుగా మారాయని, వాటికి అవుట్‌లెట్లు లేకే నగర ప్రజలు అగచాట్లు పడాల్సి వస్తుందని నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. భారీ వర్షాలకు దెబ్బతిన్న రూరల్ నియోజకవర్గ పరిధిలోని ప్రాంతాల్లో ఆయన ప్రతిరోజూ తిరుగుతున్నారు. ప్రతి ప్రాంతానికి వెళ్లి బాధితులతో స్వయంగా మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్నారు. అధికారులతో మాట్లాడి ఆ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ఏ ఒక్క డ్రైనేజీ కాలువకు అవుట్‌లెట్ లేదని, కాలువల్లో పూడిక తీయకపోవడం వల్లే భారీ వర్షాలొచ్చినప్పుడు ఇన్ని అవస్థలు పడాల్సి వస్తుందని బాధపడ్డారు. నెల్లూరులో డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను కోరారు. చిన్నపాటి వర్షాలకే నెల్లూరు జలమయం అవుతుందని, భారీ వర్షాలు వచ్చినప్పుడు పరిస్థితి ఇంకా దారుణంగా ఉంటుందన్నారు. అన్ని డ్రైనేజీ కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టి, కాలువలకు అవుట్‌లెట్ సౌకర్యం కల్పించి ఈ అవస్థలు తప్పించాలని కోరారు.



కలెక్టర్‌కు ఫోన్‌లో సమస్యను వివరిస్తున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

ఈ సందర్భంలోనే ఆయన కొండాయపాలెం గేటు వద్ద వున్న ఎస్సీ, ఎస్టీ, బిసి హాస్టళ్లను పరిశీలించారు. అక్కడ వర్షాలకు విద్యార్థులు పడుతున్న అవస్థలు చూసి బాగా బాధపడ్డారు. వెంటనే ఫోన్ ద్వారా కలెక్టర్‌కు ఈ విషయం చెప్పారు. విద్యార్థులను తక్షణం కొత్తగా కట్టిన భవనంలోకి మార్చాలని, లేకుంటే కలెక్టరేట్ గేటు ముందు కూర్చుని నిరవధిక ధర్నా చేస్తానని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమాలలో ఆయన వెంట వైసిపి నగర అధ్యక్షుడు తాటి వెంకటేశ్వరరావు, కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస యాదవ్, వైసిపి నాయకులు పి.పుల్లారెడ్డి, కె.ప్రసాద్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆ రెండు బ్యారేజీలు పూర్తయ్యుంటే...!



ఏ పనినైనా నిర్ణీత కాలంలో పూర్తి చేస్తే దాని ఫలితాలు ప్రజలకందుతాయి. లేదంటే నిరుపయోగంగా మారుతాయి. జిల్లాలో పెన్నానది మీద సంగం, నెల్లూరు బ్యారేజీల నిర్మాణానికి 2006లో శంకుస్థాపన జరిగింది. ఈ రెండు బ్యారేజీలను కూడా చకచకా పనులు చేసుంటే గట్టిగా రెండేళ్లలో పూర్తి చేసుండొచ్చు. కాని గత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పని చేయలేదు. ప్రాజెక్టుల అంచనాలు పెంచుకోవడం, నిధుల విడుదల కాకపోవడం, అధికారులు చొరవ చూపకపోవడం వంటి కారణాలతో ఈ బ్యారేజీల నిర్మాణం ఆలస్యమైంది. అయినా వీటికి శంకుస్థాపన జరిగి పదేళ్లు కావస్తుంది. ఇప్పటికి కూడా వీటికి ఒక రూపు రాలేదు. ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ బ్యారేజీల నిర్మాణాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. ఏడాదిలోపు ఈ బ్యారేజీలను పూర్తి చేయాలంటూ కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఇంతకుమునుపే ఈ బ్యారేజీల నిర్మాణ పూర్తయి వుంటే సముద్రానికి వృధాగా పోయిన వరద నీటినంతా కాపాడుకుని వుండొచ్చు. నెల్లూరు బ్యారేజీ కోసం అయితే అంతకు ముందున్న ఆనకట్టను కూడా ధ్వంసం చేశారు. ఈ ఆనకట్ట వుందున్నా కొంతమేరనైనా నీటిని నిల్వచేసి వుండొచ్చు. నెల్లూరు ఆయకట్టు క్రింద సాగునీళ్లకు, తాగునీళ్లకు లోటుండేది కాదు. ఈ ఆనకట్ట ధ్వంసం కావడంతో ఈ వర్షాలకు పెన్న కొచ్చిన వరద నీరంతా సముద్రానికి పోయింది. అదేగనుక ఈ రెండు బ్యారేజీలు ఇదివరకే పూర్తయ్యుండుంటే కనీసం అయిదారు టిఎంసీల నీటిని నిల్వచేసి వుండొచ్చు. తర్వాత ఎండాకాలంలో సాగునీళ్లకు, తాగునీళ్లకు ఇబ్బంది లేకుండా వుండేది.

# ప్రసన్నకు పదవి

## జిల్లా స్థాయిలో వదిలించుకున్నా రాష్ట్రస్థాయిలో తగులుకుంది



ప్రసన్నను అభినందిస్తున్న జడ్పీ ఛైర్మెన్ రాఘవేంద్రరెడ్డి

జిల్లా రాజకీయాలలో తనకంటూ ఒక ప్రత్యేకతను సాధించుకున్న నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఇటీవల పార్టీ జిల్లా అధ్యక్ష పదవిని ఆయన వదులుకున్నారు. పార్టీ అధ్యక్షుడిగా వుండడం కంటే తెల్ల ఏనుగును మేపడం మేలనే ఉద్దేశ్యంతోనే ఆయన ఆ పదవిని వదులుకోవడం జరిగింది. అదీగాక పార్టీ జిల్లా అధ్యక్షుడంటే గౌరవం కూడా తగ్గిపోయింది. జిల్లా నాయకత్వం అనే భావనతో కాకుండా నాయకులంతా కూడా తమ సొంత నాయకత్వాలలో పోసాగారు. అందుకే ప్రసన్న ఆ పదవిని వదులుకున్నాడు. ఎంతైనా నల్లపరెడ్డి కుటుంబం కదా... ఆ పేరెక్కడికిపోతుంది. ప్రసన్న అవసరం గుర్తించి జగన్ రాష్ట్ర కమిటీలో ఆయనకు గౌరవప్రదమైన స్థానం కల్పించారు.



నిన్న | నేడు

# నీళ్లు లేక కష్టం నీళ్లు ఎక్కువై నష్టం

■ ఆక్వా రైతులకు గోడదెబ్బ చెంపదెబ్బ

ఆక్వా రైతు పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా మారింది. వానలు లేకున్నా కష్టమే... వానలు ఎక్కువ కురిసినా నష్టమే అన్నట్లుగా ఆక్వా పరిస్థితి వుంది. జిల్లాలో తీరప్రాంతంలోని కావలి, అల్లూరు, విడవలూరు, కొడవలూరు, ఇందుకూరుపేట, టిపి గూడూరు, ముత్తుకూరు, చిల్లకూరు, కోట, వాకాడు మండలాలలో వేల ఎకరాలలో వెనామి రొయ్యల సాగు జరుగుతోంది. నాలుగైదేళ్ల క్రితం వెనామి సాగు వల్ల జిల్లాకు వందల కోట్లు లాభాలొచ్చి పడ్డాయి. ఆ దెబ్బతో వెనామికి ఎక్కడలేని డిమాండ్ పెరిగింది. రొయ్యల గుంటల లీజుల ధరలు కూడా ఎకరా 70వేల రూపాయల దాకా పోయింది. సాగు విస్తీర్ణం ఎక్కువ కావడంతో ఒక్కసారిగా సీడ్‌కు డిమాండ్ పెరగడం, హేచరీలు సీడ్ ధరను పెంచడం, వీటితో పాటు అన్ని రకాల వ్యయాలు పెరగడం జరిగింది. అయితే గత అయిదారేళ్లుగా వెనామి సాగులో ఆటుపోట్లు మొదలయ్యాయి. కొద్దిమంది రైతులకు మాత్రమే ఆదాయం రాగా ఎక్కువ మంది రొయ్యలు చేతికి రాక నష్టపోసాగారు. నీళ్లు లేకపోవడం, వైరస్, నకిలీ సీడ్, నకిలీ ఫీడ్, కరెంట్ కొరత, సాగు చేతికొచ్చినా మార్కెట్‌లో ధరలు అమాంతం పడిపోవడం వంటివి ఆక్వా రైతుతో ఆడుకున్నాయి. ఈ ఏడాది కూడా ఈ సమస్యల మధ్య ఆక్వా సాగు చేసారు. అన్నింటిని దాటుకున్నారు. మొన్నటి దాకా నీటి కొరత వేధించింది. వర్షాలొస్తే బాగుండుననుకున్నారు. అనుకున్నట్లే వర్షాలొచ్చాయి. అయితే ఆశించిన దానికన్నా అమితంగా కురిసాయి. భారీ వర్షాలకు తీరమండలాల్లోని పలు రొయ్యలగుంటలకు గండ్లు పడ్డాయి. రొయ్యలు సముద్రానికి కొట్టుకుపోయాయి. దాదాపు రెండువేల ఎకరాల ఆక్వా సాగు దెబ్బతినగా కోట్లలోనే నష్టం ఉన్నట్లు తెలుస్తోంది.

# ఆ రోడ్డు తెగితే అవస్థలే!



జేసీబీతో డైవర్షన్ రోడ్డును తెగ్గొడుతున్న దృశ్యం

భారీ వర్షాలొచ్చాయంటే నెల్లూరు – ఆత్మకూరు, సంగం – కలిగిరిల మధ్య రోడ్లు తెగుతుంటాయి. వాహనాల రాకపోకలు నిలిచి ప్రయాణీకులు ఇబ్బందులు పడుతుంటారు. ఎప్పుడు భారీ వర్షాలొచ్చినా ఈ మార్గాలలో ఇదే పరిస్థితి. తాజాగా కురిసిన భారీ వర్షాలతో నెల్లూరు, ఆత్మకూరుల మధ్య వాహనాల రాకపోకలు నిలిచిపోవడం జరిగింది. ఆత్మకూరు మార్గంలోని వాసిలి వద్ద వంతెన నిర్మాణంలో వుంది. దీని కోసం డైవర్షన్ రోడ్డు వేసారు. అయితే భారీ వర్షాలకు వాసిలి చెరువు నిండి అలుగు పారసాగింది. అయితే ఈ అలుగు నీళ్లను కాలువపై వేసిన డైవర్షన్‌రోడ్డు అడ్డుకట్టలా మారడంతో సమీపంలోని ఎస్సీ, ఎస్టీ కాలనీలు మునిగిపోయే పరిస్థితి ఏర్పడింది. దీంతో స్థానికులు డైవర్షన్‌రోడ్డును తెగ్గొట్టారు. దీంతో వాహనాల రాకపోకలు బంద్ అయ్యాయి. నెల్లూరు నుండి ఆత్మకూరు వెళ్లే వాహనాలను హసనాపురం, ఏ.ఎస్.పేటల మీదుగా పంపించారు. ఆత్మకూరు నుండి నెల్లూరు వచ్చే వాహనాలను వింజమూరు, కలిగిరిల మీదుగా మళ్లించారు. కడప, అనంతపురం, కర్నూలు జిల్లాల నుండి వచ్చే బస్సులను సైతం వింజమూరు, కలిగిరిల మీదుగా నడిపించారు.

# పర్యవేక్షణకు ఇద్దరు ఐఏఎస్‌లు

జిల్లాలో భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో సహాయ చర్యల పరిశీలన కోసం ప్రభుత్వం ఇద్దరు ఐఏఎస్ అధికారులను నియమించింది. నాయుడుపేట డివిజన్‌కు ఏ.రవిచంద్ర, గూడూరు డివిజన్‌కు గిరిధర్‌లను నియమించారు.

# వేడుకగా నాగులచవితి



ఈ నెల 15వ తేదీన నెల్లూరులో నాగులచవితి పండుగను మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మూలాపేటలోని ధర్మరాజు స్వామి గుడి వద్ద, మాగుంట లే అవుట్‌లో ఎస్ఆర్‌కె స్కూలు ఎదురుగా, పొర్లుకట్ట, బాలాజీనగర్ పుట్టవీధి, నిప్పో ఎదురుగా, అయ్యప్ప గుడి, వేదాయపాలెం, నవాబుపేట, కొండాయపాలెం గేటు తదితర ప్రాంతాల్లో వున్న పుట్టల వద్ద వేకువ నుండే మహిళలు క్యూలో నిలబడి పాలుపోసి నోములు తీర్చుకున్నారు.

# విద్యార్థులకు భోజన ప్లేట్లు



నారాం బాలకృష్ణన్ ఛారిటబుల్ ట్రస్ట్ మెంబర్లు రాజ్యలక్ష్మి, నరన్వతి, భట్టారం శ్రీనివాసులు దాతృత్వంతో బ్రాహ్మణ మహాసభ ఆధ్వర్యంలో నెల్లూరు వెంగళరావు నగర్ తాతయ్య మునిసిపల్ పాఠశాలలో చిల్డ్రన్స్‌డేను పురస్కరించుకుని 14వ తేదీ పాఠశాలకు చెందిన 350మంది విద్యార్థినీ విద్యార్థులకు భోజనప్లేట్లు, పెన్సిల్ బాక్సులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాలరాజు, బ్రాహ్మణ మహాసభ ప్రతినిధులు డా॥ సర్వేపల్లి అజయ్‌కుమార్, రాళ్ళపల్లి రామసుబ్బారావు, వై.నాగదేవి ప్రసాద్, ఆర్.వెంకట్రామన్, బుడంగుంట సతీష్, ఆర్‌వియస్ ప్రసాద్, కిషోర్ పాల్గొన్నారు.

# చుక్కలు చూపిస్తున్న టమోటా!



ప్రతి కుక్కకు ఒకరోజు వస్తుందనే సామెత వుంది. ఇది నిత్యావసర వస్తువులు, పండ్లు, కూరగాయలకు కూడా వర్తిస్తుంది. ఇప్పుడు మార్కెట్‌లో మినపప్పుకు టైం వచ్చినట్లే కూరగాయల్లో టమోటాకు టైం వచ్చింది. అప్పుడప్పుడు పత్రికల్లో చూస్తుంటాం... కొనేవాళ్ళు లేక మదనపల్లి వద్ద టన్నుల కొద్ది టమోటాలను రైతులు రోడ్డుపై పారబోసారని... ఇలాంటి వాటితో పాటు టమోటా కిలో 100రూపాయలు వంటి వాటిని కూడా వింటున్నాం. మార్కెట్‌లో టమోటాల ధరలు అదిరిపోతున్నాయి. మొన్నటిదాకా ప్రజలకు ఎర్రగడ్డల ధరలు చుక్కలు చూపించాయి. ఇప్పుడు టమోటాలు కూడా అదే పని చేస్తున్నాయి.

# వ్యవసాయ ఉద్యోగుల ఎన్నికలు

ఈ నెల 14న నెల్లూరులోని వ్యవసాయ శాఖ కార్యాలయం ఆవరణలో ఏపి అగ్రికల్చర్ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ ఎన్నికలు రసవత్తరంగా జరిగాయి. వెంకటేశ్వర్లు, ఎంవిఎస్ ప్రసాద్ ప్యానెళ్ళ హోరాహోరీగా తలపడగా అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు విజయం సాధించారు. అలాగే కార్యదర్శిగా దొర స్వామి, కోశాధికారిగా వై.శ్రీనివాసులు గెలుపొందారు. ఎన్నికల అనంతరం నాగరాజు, శాంతరాజు, ఆదినారాయణ, జయరాజు, పుల్లయ్య, పద్మావతి, విజయమ్మ, మురళీ, సుధా, చరణ్, సాయి కృష్ణారెడ్డి, హైమావతి, రాజేంద్ర, విజయలక్ష్మిలను కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# నెల్లూరు కబుర్లు

## ముఖ్యమంత్రి పర్యటన వాయిదా

షెడ్యూల్ ప్రకారం ఈ నెల 21వ తేదీన జిల్లాలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన వుండింది. ఆరోజు రాపూరు మండలంలోని కండలేరు, చిల్లకూరు, వెంకటాచలం, ముత్తుకూరు మండలాలలోని కృష్ణపట్నం పోర్టు పరిధిలో జరిగే కార్యక్రమాలలో ఆయన పాల్గొనాల్సి వుండింది. అయితే జిల్లాను ముంచెత్తిన భారీ వర్షాల నేపథ్యంలో ఆయన పర్యటన వాయిదా పడింది. బుధవారం నెల్లూరుజిల్లాలో ఏరియల్ సర్వే నిర్వహించడానికి సిఎం రేణిగుంటలో హెలికాప్టర్ ఎక్కారు. అయితే వాతావరణం అనుకూలించక పైలట్ హెలికాప్టర్‌ను దించేసాడు. దీంతో సిఎం చిత్తూరుకు వెళ్లిపోయారు.

## నెల్లూరులోనే మంత్రులు



భారీవర్షాల నేపథ్యంలో మున్సిపల్ మంత్రి పి.నారాయణ, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి శిద్దా రాఘవరావులు నెల్లూరులో మకాం వేశారు. ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్నారు. మనుబోలు వద్ద తెగిపోయిన జాతీయ రహదారికి మరమ్మత్తులు చేసి రాకపోకలు పునరుద్ధరించడానికి మంత్రు లిద్దరు కూడా ప్రత్యేకదృష్టి పెట్టి పని చేశారు. అధికారులతో మీడియాతో ఎప్పటికప్పుడు సంప్రదిస్తూ సహాయక చర్యలను వేగవంతం చేశారు.

## పెద్దాసుపత్రిని ఓ కొలిక్కి తెస్తాం

నెల్లూరు దర్గామిట్టలోని దొడ్డ సుబ్బారెడ్డి ప్రభుత్వాసుపత్రిలో త్వరలో అన్నిరకాల వైద్య సౌకర్యాలను కల్పించి అన్ని సేవలను మెరుగుపరుస్తామని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ అడ్మినిస్ట్రేషన్ అధికారి డాక్టర్ వెంకటేష్ తెలిపారు. సోమవారం ఆయన వైద్యశాఖ కమిషనర్ డాక్టర్ సోమనాథ్‌తో కలిసి మెడికల్ కళాశాల, పెద్దాసుపత్రిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు ఫ్లోర్లలో నూతన భవనాలను నిర్మించి జూన్ నాటికి సిద్ధం చేస్తామన్నారు. త్వరలో 100మంది వైద్యులు తెలంగాణ నుంచి రాష్ట్రానికి వస్తారని, అప్పుడు వైద్యుల కొరత తీరుతుందన్నారు. స్టాఫ్ నర్సుల కొరత తీర్చేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మెడికల్ కళాశాలలో మంచి బోధనతో పాటు పెద్దాసుపత్రిలో మంచి వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ భారతి, ఏడి భీమతాటి రంగారావు, డిసిహెచ్ సుబ్బారావు, మెడికల్ కళాశాల వైస్‌ప్రిన్సిపల్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## ముంగమూరు పుట్టినరోజు



మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి జన్మదినోత్సవాన్ని ఆయన అనుచరులు, అభిమానులు, తెలుగుదేశం కార్యకర్తలు సోమవారం నగరంలో ఘనంగా నిర్వహించారు. 14వ డివిజన్‌లోని గీతామయి వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి అక్కడ వృద్ధులకు అన్నదానం చేసారు. అలాగే అందరికీ దుప్పట్లు ఇచ్చారు. ప్రగతి ఛారిటబుల్ ట్రస్ట్‌లో వికలాంగ విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు. ఆత్మకూరు బస్టాండ్ ప్రాంతంలో ఫుట్‌పాత్‌లపై వుండే వృద్ధులకు, భిక్ష యాచకులకు అల్పాహారం పంపిణీ చేసారు.

## మాడరన్ బాలల దినోత్సవం



నెల్లూరు, సరస్వతీనగర్‌లోని మాడరన్ స్కూలులో ఈ నెల 14వ తేదీ బాలల దినోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. చిన్నారులకు ఆటపాటలతో పాటు క్విజ్ పోటీలు నిర్వహించారు. చిన్నారులు, విచిత్ర వేషధారణలతో, దేశనాయకుల వేషధారణతో పాల్గొని అలరించారు. శాస్త్రీయ నృత్యాలు, కూచిపూడి నృత్యాలతో చిన్నారులు అందరినీ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో స్కూలు కరస్పాండెంట్ వాకాటి విజయ్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపల్ రవికుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నిలిచిన బస్సులు

భారీవర్షాలకు జిల్లాలో వాగులు, వంకలు పొంగడం, పలుచోట్ల రోడ్లు తెగిపోవడంతో జిల్లాలోని అన్ని డిపోలలో దాదాపు వందల బస్సులను నిలిపివేసారు. సోమ, మంగళ బుధ గురువారాలలో ఈ పరిస్థితి కొనసాగింది. ఆర్టీసీకి యధాఫలంగా లక్షల్లో నష్టం వాటిల్లింది.



## కలెక్టరేట్‌లో తప్పని కారుడు

భారీ వర్షాలకు జిల్లా కలెక్టరేట్ కూడా ఉరుస్తోంది. 125 ఏళ్ల చరిత్ర వున్న భవనమిది. ఇంకా కారకుండా వుంటుంది. పైకప్పు ఉరుస్తుండడంతో కంప్యూటర్లు, విలువైన ఫైళ్లను భద్రపరచడానికి అధికారులు నానా తంటాలు పడ్డారు. టి.బి ఆసుపత్రి ప్రాంగణంలో కొత్త కలెక్టరేట్ భవనం పూర్తయితే గాని వీరికి ఈ కష్టాలు తీరవు.

## రైలు ప్రయాణీకులకు ఆహారం

భారీ వర్షాల కారణంతో నెల్లూరు రైల్వేస్టేషన్‌లో సోమవారం నిలిచిపోయిన కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌లోని ప్రయాణీకులకు రెడ్‌క్రాస్ ప్రతినిధులు, శ్రీ సత్యసాయి సేవాసమితి రైల్వే యూజర్స్ అసోసియేషన్ వాళ్లు ఆహారాన్ని అందించారు. ప్రయాణీకులు ఆకలితో అలమటించకుండా తమ సాయాన్ని అందించారు.

## 120కే కందిపప్పు

ఆఫ్రికన్ కందిపప్పును హోల్‌సేల్‌గా 120రూపాయలకు, రీటైల్‌గా 123రూపాయలకు అమ్మాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి పరిటాల సునీత పప్పు ధాన్యాల మిల్లర్లు, వ్యాపారు లతో సమావేశం నిర్వహించి ఈ ధరలకు వారిని ఒప్పించారని ఆయన పేర్కొన్నారు.

## పోలీసులకు డెంగీ మందులు




నెల్లూరుజిల్లాలోని పోలీసులకు డెంగ్యూ వంటి విషజ్వరాలు సోకకుండా ఎస్పీ గజరావు భూపాల్ హోమియో మందులను పంపిణీ చేశారు. ఇటీవల నెల్లూరులోని పోలీసు పరేడ్‌గ్రౌండ్‌లో ఈ కార్యక్రమం జరిగింది. హోమియో వైద్యులు డాక్టర్ శ్రీనివాసకుమార్ ఆధ్వర్యంలో 300మంది సిబ్బందికి ఈ మందులను అందించారు.

## ఎస్‌ఐల బదిలీ

జిల్లాలో వివిధ పోలీసుస్టేషన్‌లలో పని చేస్తున్న 9మంది ఎస్‌ఐల బదిలీలు జరిగాయి. నెల్లూరు త్రీటౌన్‌లో వున్న కె.ప్రసాద్‌రెడ్డిని పొదలకూరుకు, బుచ్చిలో వున్న కె.శ్రీనివాసరావును టిపి గూడూరుకు, ఇక్కడ వున్న పి.రామకృష్ణను నెల్లూరు త్రీటౌన్‌కు, గూడూరు వన్‌టౌన్‌లో వున్న బి.గోపాల్‌ను చిట్టమూరుకు, ఇక్కడున్న కె.రవినాయక్‌ను పొదలకూరుకు, వెంకటగిరిలో వున్న పి.వి.నారాయణను నాయుడుపేటకు, ఇక్కడున్న ఆంజనేయరెడ్డిని వెంకటగిరికి, ఆత్మకూరులో వున్న వేణుగోపాలరెడ్డిని బుచ్చిరెడ్డిపాలెంకు బదిలీ చేశారు.

• కలెక్టర్‌కు మండింది

## రెడ్డయ్యకు బదిలీ అయ్యింది

జిల్లాలో ఇరిగేషన్ శాఖ ఎస్ఇ రెడ్డయ్యను ప్రభుత్వం బదిలీ చేసింది. ఆయన బదిలీకి కలెక్టర్ యం.జానకి ఆగ్రహమే కారణంగా కనిపిస్తోంది. 2014 నవంబర్ 20న కడప జిల్లా నుండి వచ్చిన రెడ్డయ్య ఇక్కడ ఎస్ఇగా బాధ్యతలు తీసుకున్నారు. అయితే ఈ ఏడాదికాలంలో 'నీరు – చెట్టు' కార్యక్రమం అమలులో అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఇక రెడ్డయ్య పనితీరు పట్ల కూడా కలెక్టర్ అసంతృప్తి చెందింది. కలెక్టర్ నిర్వహించే సమావేశాలకు కూడా ఇతను పెద్దగా వెళ్లేవాడు కాదు. ఇతను పూర్తి బాధ్యతారహిత్యంతో వున్నాడని కలెక్టర్ ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడంతో ఆయనపై బదిలీ వేటు పడింది. ఆయన స్థానంలో సోమశిల ఎస్ఇ సుబ్బారావుకు ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగించారు.

# సాహితీ దిగ్గజానికి నాగభైరవ పురస్కారం



డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు... సాహిత్యంలో ఆయన ఎక్కని పర్వతాలు లేవు, దిగని లోయలు లేవు, ఈదని సముద్రాలు లేవు. ఉత్తమమైన, సంస్కారవంతమైన, స్ఫూర్తిదాయకమైన సాహిత్యానికి నిలువెత్తు నిదర్శనం నాగభైరవ కోటేశ్వరరావు. ఇక ఆయన పేరుతో నెలకొల్పిన అవార్డు ఎంత ప్రతిష్టాత్మకమైనదన్నది ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఏ పేరుతో అయితే అవార్డు నిస్తున్నారో వారికే కాదు, ఆ అవార్డును అందుకునేవారికి కూడా ఆ అర్హత ఉం డాలి. అందుకు నూటికి నూరుపాళ్లు అర్హుడు తెలుగు కళామతల్లి ముద్దుల తనయుడు, సాహితీపుత్రుడు గొల్లపూడి మారుతీరావు.



● డాక్టర్ నాగభైరవ స్మారక అవార్డు అందుకున్న గొల్లపూడి మారుతీరావు

ఈ నెల 15వ తేదీన నెల్లూరులోని పురమందిరంలో డాక్టర్ నాగభైరవ అవార్డు కమిటి నిర్వహించిన కార్యక్రమంలో ఆయన శాసనమండలి సభ్యులు బీద రవిచంద్ర, ప్రముఖ సినీ కవి వెన్నెలకంటి, 'లాయర్' వారపత్రిక సంగ్రాహకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి, మురళీకృష్ణ హోటల్స్ అధినేత వీరిశెట్టి హజరత్‌బాబు, ఆంధ్రప్రభ రచయిత నియోగి, సినీ దర్శకులు నాగభైరవ వీరబాబుల చేతులమీదుగా ఈ అవార్డును అందుకున్నారు. నాగభైరవ అవార్డును అందుకున్న ఆనందాన్ని గొల్లపూడి తన ప్రసంగంలో వ్యక్తపరిచారు. తనకు ఏ వ్యక్తి పేరుతో అయితే అవార్డునిచ్చారో ఆ నాగభైరవ కోటేశ్వరరావు గురించే గొల్లపూడి తన ప్రసంగంలో ఎక్కువుగా ప్రస్తావించారు. ఆయనతో తనకున్న అనుబంధాన్ని సభలో చక్కగా వివరించారు. తన కుమారుడు శ్రీనివాస్ చనిపోయినప్పుడు తనను ఓదారుస్తూ నాగభైరవ తనకు వ్రాసిన ఉత్తరాన్ని సభలో చదివి వినిపించి గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఈ ఉత్తరం చదువుతున్నప్పుడు ఆయన దుఖాన్ని బిగపట్టడం కనిపించింది. 1996లో ఇదే వేదికపై స్వర్గీయ డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి చేతుల మీదుగా 'లాయర్' వారపత్రిక వ్యవస్థాపకులు తుంగా రాజగోపాలరెడ్డి స్మారక అవార్డునందుకున్న విషయాన్ని గుర్తు చేసుకున్నారు. మంచి ఆలోచనలను పదిమందికి పంచి సమాజానికి నాణ్యమైన సాహిత్యాన్ని అందించిన నాగభైరవ అవార్డును అందుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నానని ఆయన చెప్పుకొచ్చారు. తనకు అన్నీ సహకరిస్తే నాగభైరవ రచనల మీద పిహెచ్‌డి చేయాలని వుందని తన అభిప్రాయం వ్యక్తం చేశారు.

సభకు అధ్యక్షత వహించిన వెన్నెలకంటి మాట్లాడుతూ గొల్లపూడి మారుతీరావుకు ఎప్పుడో ఈ అవార్డును అందజేయాల్సివుందని, తేదీలు కుదరక ఇప్పుడు ఆయనకు అవార్డ్‌నిచ్చే అదృష్టం కలిగిందన్నారు. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర తన ప్రసంగంలో గొల్లపూడి సాహిత్య, సినీ రంగానికి అందిస్తున్న సేవలను కొనియాడుతూ ప్రతి యేటా నాగభైరవ అవార్డు సభకు తన సోదరుడు బీద మస్తాన్‌రావు మాత్రమే వచ్చేవాడని, వచ్చే సంవత్సరం నుండి తామిద్దరం వస్తామని హామీ ఇచ్చారు. 'లాయర్' వారపత్రిక సంగ్రాహకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి మాట్లాడుతూ గొల్లపూడి ఎప్పుడు నెల్లూరొచ్చినా వర్షాన్ని హర్షాన్ని వెంటబెట్టు కొస్తారని, 1996లో ఇదే నెలలో ఇదే టౌన్‌హాల్‌లో మొట్టమొదటి తుంగా రాజగోపాలరెడ్డి స్మారక అవార్డును ఆయనకే అందజేసామని, ఆరోజు కూడా భారీ వర్షమని, ఈరోజు కూడా గొల్లపూడికి వర్షం స్వాగతం పలికిందన్నారు. ఈ నేలపై తెలుగు చరిత్ర ఉన్నంత వరకు సాహితీవేత్తగా గొల్లపూడి పేరు చిరస్థాయిగా నిలిచే వుంటుందన్నారు. ఈ సభలో కోమిట్ల గ్రూప్ అధినేత కోమిట్ల రెనిల్‌కుమార్ రెడ్డి, నియోగి, నాగభైరవ వీరబాబులు ప్రసంగించారు.



నాగభైరవ స్ఫూర్తి అవార్డుల ప్రదానం

ఈ సందర్భంగా ప్రతి సంవత్సరంలాగే ఈ సంవత్సరం కూడా సాహిత్య రంగంలో కృషికిగాను గుమ్మడి శ్రీనివాసులురెడ్డి(గల్పిక శ్రీను), వేంపల్లి అబ్దుల్ ఖాదర్, బోడావుల నాగేశ్వరరావు, వెన్నిచెట్టి సింగారావు, మోదుగుల రవికృష్ణ, చింతా అప్పలనాయుడులకు నాగభైరవ స్ఫూర్తి అవార్డులను ప్రదానం చేశారు. పద్యకవితా పోటీల విజేత ఉన్నం జ్యోతివాసును సత్కరించారు. కార్యక్రమానికి ముందు కళాంజలి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులకు వీనులవిందు చేసింది. ఈ కార్యక్రమాన్ని కళాంజలి అనంత్, కమిటి సమన్వయకర్త బీరం సుందరరావులు పర్యవేక్షించారు.

ఒక గురువు ఎంత మంది శిష్యులను సంపాదించుకున్నాడన్నది కాదు, ఎంత మంచి శిష్యులను సంపాదించుకున్నాడన్నదే ముఖ్యం. ఈ కోవలో చూస్తే నాగభైరవ ధన్యుడు. చాలామంది గొప్ప వ్యక్తుల అవార్డులను వారి కుటుంబసభ్యులు కొనసాగిస్తుంటారు. కాని నాగభైరవ అవార్డును ఆయనకున్న వేల శిష్యుల్లో ఇద్దరైన వెన్నెలకంటి, చిన్ని నారాయణరావులు నిర్వహిస్తున్నారు. తమ గురువు పేర డాక్టర్ నాగభైరవ అవార్డు కమిటీని నెలకొల్పి ఆ కమిటీకి తామే అధ్యక్ష, ప్రధానకార్యదర్శులుగా వ్యవహరిస్తూ ఏడేళ్లుగా ఈ అవార్డు ప్రదానోత్సవాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తూ మన్ననలు పొందుతున్నారు. నాగభైరవ వంటి గురువును పొంది వేల మంది శిష్యులు అదృష్టవంతులై వుండొచ్చు, కాని తన పేరును చిరస్థాయిగా నిలిపే ఇలాంటి శిష్యులను పొందిన నాగభైరవ కోటేశ్వరరావు ఎంతో పుణ్యజీవి. ధన్యజీవి.

# నీళ్లు ఇళ్లలో... జనం రోడ్లల్లో

**- అనిల్‌కుమార్ యాదవ్**



నెల్లూరులోని ప్రధాన కాలువలన్నీ పూడికతో పూడిపోవడంతో ఇళ్లలో నీళ్లు చేరి ప్రజలు రోడ్ల మీద ఉండాల్సి వస్తుందని నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ నెల 16, 17, 18తేదీలలో ఆయన వర్షాలకు దెబ్బతిన్న నగర పరిధిలోని పలు ముంపు ప్రాంతాలను సందర్శించి బాధితులను పరామర్శించారు. వాళ్లకు అందించాల్సిన సహాయక చర్యలను పర్యవేక్షించారు. ప్రధాన కాలువల్లో ముందే పూడిక తీసి ఉంటే ఈరోజు ఇళ్లల్లోకి నీళ్లొచ్చే పరిస్థితి వుండేది కాదన్నారు. భారీగా కురిసిన వర్షాల వల్ల మన్సూర్ నగర్, కోనేటిమిట్ట, మున్సిపల్ క్వార్టర్స్, వెంకటేశ్వరపురం, వైకుంఠపురం తదితర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఇళ్లల్లోకి నీరు చేరి తల దాచుకోవడానికి గూడు లేని వారికి పునరావాసం, భోజన వసతి కల్పించాలని ఆయన కోరారు.

ఈ పర్యటనల్లో ఆయన వెంట వైకాపా ఫ్లోర్ లీడర్ పి.రూప్‌కుమార్‌యాదవ్, కార్పొరేటర్లు జి.నాగరాజు, యం.డి.ఖలీల్ అహ్మద్, వైసిపి నాయకులు మురళీకృష్ణ, జనార్ధన్‌రెడ్డి, మెట్టుకూరు సునీల్‌రెడ్డి, మణి, సునీల్, రంగ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిక్షణం అప్రమత్తం

**- జిల్లా కలెక్టర్ జానకి**



బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో నెల్లూరుజిల్లాలో కురుస్తున్న భారీవర్షాలకు ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ప్రత్యేకచర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ జానకి అన్నారు. సోమవారం కలెక్టర్ ఛాంబర్‌లో విలేకర్లతో ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 125.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందన్నారు. డివి సత్రం మండలంలో అత్యధికంగా 31సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని తెలిపారు. ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. భారీ వర్షాలకు చెరువులకు గండ్లు పడే అవకాశం ఉన్న ప్రాంతాల్లో ఇసుక బస్తాలు సిద్ధం చేసామన్నారు. గుంటూరు నుంచి ప్రత్యేకబృందం జిల్లాకు వచ్చిందన్నారు. విపత్కర పరిస్థితుల్లో ప్రత్యేక బృందం రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపడుతుందని తెలిపారు. మత్స్యకారులు వేటకు వెళ్ళకుండా ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. సహాయక చర్యలు చేపట్టేందుకు కలక్టరేట్, ఆర్‌డిఓ కార్యాలయాల్లో కంట్రోల్ రూములు ఏర్పాటు చేసామన్నారు. ఇవి 24గంటలు పని చేస్తాయన్నారు. కలెక్టరేట్ 0861-2331477, ఆర్డీఓ కార్యాలయం 0861-2333634, కావలి ఆర్డీఓ కార్యాలయం 08626 - 241564, ఆత్మకూరు ఆర్‌డిఓ కార్యాలయం 08627 - 223011, గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయం 08624- 252 807, నాయుడుపేట ఆర్డీఓ కార్యాలయం 08623-277345 నెంబర్లు కేటాయించినట్లు తెలిపారు.

# నేతాజీలో చాచాజీ జయంతి




నవభారత నిర్మాత, పిల్లలందరిచే చాచాజీగా పిలువబడే పండిట్ జవహర్‌లాల్‌నెహ్రూ జన్మదినం సందర్భంగా ఈ నెల 14వ తేదీ శ్రీ నేతాజీ పైలట్ హైస్కూల్ విద్యార్థులు నెల్లూరు టౌన్‌హాలులో చిల్డ్రన్స్‌డే సంబరాలు వేడుకగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా శ్రీకృష్ణ చైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ పి.చంద్రశేఖర్‌రెడ్డి, నెల్లూరుజిల్లా ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యం సంఘం (నెపస్మా) జిల్లా అధ్యక్షులు బి.మనోహర్‌రెడ్డి, సంఘం జిల్లా కార్యదర్శి వై.వెంకటరామయ్యలు పాల్గొని నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా సాంస్కృతిక కార్యక్రమాల్లో, నెహ్రూ వేషధారణల్లో పాల్గొని అలరించారు. అనంతరం నెహ్రూ జీవిత విశేషాలను ఇంగ్లీషు, తెలుగు, హిందీ బాషల్లో విద్యార్థులు ఉపన్యసించారు. చాచానెహ్రూ డ్రాయింగ్, కలరింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కె.నరేంద్రరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు ఎన్.ప్రసన్న, వైస్‌ప్రిన్సిపల్ డి.వాణి, ఆనీగ్రేస్, పిఇటి రమేష్, కల్పన, సుకృత ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# గ్రామీణ ప్రాంతాల్లో రోటరీ సేవలు

గ్రామీణ ప్రాంతాలకు రోటరీ సేవలు విస్తరించడం శుభ పరిణామమని రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి అన్నారు. రూరల్ మండలంలోని బద్వేలివెంకన్న పాళెంలో నిరుపేద వృద్ధులకు దుప్పట్లను రొటేరియన్ ఎం.శ్రీహరినాయుడు సమ ర్పించగా సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షులు ఎస్.వి. అశోక్‌చక్రవర్తి ప్రసంగిస్తూ వృద్ధులకు, బలహీనవర్గాలకు రోటరీక్లబ్ ఎప్పుడూ అండగా వుంటుందన్నారు. ఈ సమా వేశంలో సర్పంచ్ కవిత ప్రసంగిస్తూ తమ గ్రామంలో ఇటువంటి సేవా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన రోటరీ క్లబ్‌కు, శ్రీహరి నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల వర్షాలకు చలి వాతావరణం ఏర్పడి ఇబ్బం దులు పడుతున్న వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ సెక్రటరీ మునిరాజా, సీనియర్ రొటేరియన్లు, గ్రామ ప్రముఖులు, రాధాకృష్ణారెడ్డి, శేషారెడ్డి, చెంచురెడ్డి, మాధవరెడ్డి, వేణురెడ్డి, హనుమంతునాయుడు, శేఖరనాయుడు, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న రూరల్ సిఐ శ్రీనివాసరెడ్డి, రోటరీ క్లబ్ ప్రతినిధులు

## గూడూరు డివిజన్ వార్తలు

# మానసికోల్లాసంతో సమస్యలు దూరం

సాంస్కృతిక కార్యక్రమాలతో మాన సికోల్లాసం కలుగుతుందని, తద్వారా సమస్యలు దూరమవుతాయని ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్ మురళీకృష్ణ, రోటరీ క్లబ్ అధ్యక్షుడు అశోక్‌చక్రవర్తి తెలిపారు. పట్టణంలోని రోటరీ భవనంలో రోటరీ క్లబ్, విన్నర్‌వీల్ క్లబ్‌లు సంయుక్తంగా బాలల దినోత్సవం సందర్భంగా పలు పాఠశాలల విద్యార్థు లకు సాంస్కృతిక పోటీలను నిర్వహిం చాయి. పోటీలతో పిల్లల్లోని సృజనాత్మ కతను వెలికి తీయవచ్చని వక్తలు తెలి పారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు నాగేంద్రప్రసాద్, గురుగుహ, మునిరాజ, కె.మునిగిరీష్, దశరథ రామిరెడ్డి, కె.సుందరరామిరెడ్డి, సునంద, కెవిఎస్‌రెడ్డి, స్నేహలత తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రోటరీ క్లబ్ అధ్యక్షుడు అశోక్ చక్రవర్తి, ప్రక్కన ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్ మురళీకృష్ణ

# బాలసదన్‌లో విద్యా సామాగ్రి పంపిణీ



విద్యార్థులకు విద్యాసామాగ్రిని పంపిణీ చేస్తున్న వై.చలపతిరావు, ప్రక్కన లయన్స్ అధ్యక్షుడు తోట సురేష్ తదితరులు

గూడూరు బాలసదన్‌లో ఆదివారం నాడు ప్రతి సంవత్సరం జరుపుకుంటున్న కీర్తిశేషులు యరగుడిపాటి వేదవతి 83వ పుట్టినరోజు సందర్భంగా బాలికలకు విద్యాసామాగ్రిని, స్కూలు బాక్సులు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆమె కుమారుడు ప్రముఖ న్యాయవాది యరగుడిపాటి చలపతిరావు మాట్లాడుతూ తమ తల్లి ఆదరాభిమానాలతో, ఎందరో అనాధలను దగ్గరకు తీసి, 22మందికి పెళ్ళిళ్ల జరిపించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు తోట సురేష్, మల్లు విజయకుమార్‌రెడ్డి, నవీన్ జయకుమార్, చంద్రశేఖర్, న్యాయవాది తిరుమలేషు తదితరులు పాల్గొన్నారు.

## నారాయణ క్యాంపస్ ఎంపికలు


ప్రతినిధులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

గూడూరు నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో 14వ తేదీ హుసేన్ కంపెనీ ఆధ్వర్యాన క్యాంపస్ ఎంపికలను నిర్వ హించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ వీర సుదర్శనరెడ్డి తెలిపారు. 2015 విద్యా సంవత్సరం బిటెక్, ఎంబిఏ, ఎంసిఏ విద్యార్థులు 100 మంది ఎంపికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యా పకులు, కళాశాల యాజమాన్యం క్యాంపస్ ఎంపికలు చేసిన ప్రతినిధులను ఘనంగా సన్మానించారు.


# విద్యార్థులే రేపటి ఉత్తమపౌరులు

**- ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్**

నేటి విద్యార్థులే సమాజంలో రేపటి ఉత్తమపౌరులుగా ఎదగాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. 14వ తేదీ స్థానిక ఆంధ్ర మహిళా మండలి కార్యా లయంలో ఆ సంస్థ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం సందర్భంగా రాణిపేట ఎయిడెడ్ పాఠశాలకు బెంచీలను అంద జేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ చదువుల ద్వారానే ఉన్నత స్థానా లకు చేరుతామన్నారు. పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు ముందుకు వచ్చిన దాతల దాతృత్వాన్ని సద్వినియోగం చేసు కుని చదువులపై శ్రద్ధ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో విష్ణువందన, పానకా సునందారెడ్డి, డాక్టర్ సి.రోహిణి, యారం మంజుల, సారంగం సులక్ష్మి, పరమేశ్వరి, స్నేహలతారెడ్డి తది తరులు పాల్గొన్నారు.



# అతలాకుతలమైన జన జీవనం



- శ్రీకాళహస్తీశ్వరాలయ పరిస్థితి ఆగమ్యగోచరం
- 20 సంవత్సరాల తర్వాత స్వర్ణముఖికి వరద
- కాళంగి రిజర్వాయర్ గేటు ధ్వంసం
- జలదిగ్బంధంలో శ్రీకాళహస్తి, సత్యవేడు

## శ్రీకాళహస్తి న్యూస్

దక్షిణకాశిగా ప్రసిద్ధి చెందిన పంచ భూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన శ్రీకాళహస్తీశ్వరా లయం మూడు అడుగుల జలదిగ్బంధమైంది. 11వ శతాబ్దంలో నిర్మించినట్లు చారిత్రక ఆధారాలున్నాయి. ఈ ఆలయాన్ని కైలాసగిరులుగా పిలువబడే కొండ చరియలో నిర్మించారు. 1516లో శ్రీ కృష్ణ దేవరాయులచే నిర్మించిన రాజగోపురం 2011 మే 16వ తేదీన కుప్పకూలింది. నేడు ఆలయం తూర్పు వైపు గోడ నుంచి నీటి ధారలు ఆలయంలోకి వచ్చి పై కప్పు నుంచి ఊరుస్తుంది. గత 10 సంవత్సరాలుగా ఆలయ ఉపరి తలం మరమ్మత్తులు చేయాలన్నది ప్రతిపాదనలే తప్ప ఆచరణకు నోచుకోవడం లేదు. ఆలయంలో తూర్పు వైపు యాగశాల వద్ద గల గోడ నుంచి నీటి ధార ఆలయం లోపలకు వస్తుంది. ఇక ఆలయం పైభాగంలో నుంచి కూడా వర్షపు నీటితో తడిసి పోయింది. పురాతన ఆలయానికి పర్యవేక్షణ కరువైంది. విషయం తెలుసుకున్న దేవాదాయ శాఖ కమిషనర్ అనూరాధ సోమవారం ఆలయానికి విచ్చేసి పరిశీలించారు. అనంతరం ఆమె ఆలయంలో ఉరుస్తున్న పరిస్థితిని గమనించారు. ఈ వర్షానికి దేవేరి జ్ఞానప్రసూనాంబ అమ్మవారి గర్భగుడి ఎదురుగా ఉన్న గోడల నుంచి పైపులు ఏర్పాటు చేసినా నీళ్ళు చిమ్మడంతో భక్తులు, అధికారులు ఆందోళన చెందారన్నారామె. లీకేజీలు దురదృష్టకరమన్నారు. ఈ లీకేజీలను శాశ్వతంగా పరిష్కరించుటకు నిపుణుల కమిటీని పంపనున్నట్లు తెలిపారు. అంతకు ముందు ఆలయ కార్యనిర్వహణాధికారి భ్రమరాంబ, ఆలయ చైర్మన్ గురవయ్యనాయుడు, సభ్యులు కంద్రిగ ఉమ, బాలాజీ ఆలయ ఇంజనీరింగ్ అధికారులు పరిశీలించారు.

### 20 సంవత్సరాల తర్వాత స్వర్ణముఖినదికి జల కళ – కాళంగి రిజర్వాయర్ గేటు ధ్వంసం

బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం కారణంగా కుండపోత వర్షంతో "20 సంవత్సరాల తర్వాత స్వర్ణముఖినదికి జలకళ" ఏర్పడడంతో భక్తులు, ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని చెరువులు, కాలువలు, గుంటలు నిండి పొంగి పొర్లుతున్నాయి. 1956వ సంవత్సరంలో కాళంగి రాజర్వాయర్‌ను నిర్మించారు. ఈ రిజర్వాయర్‌కు ఉన్న మూడు గేట్లలో ఒక గేటు నీటి ప్రవాహానికి కొట్టుకుపోయింది. 1984వ సంవత్సరంలో స్వర్ణముఖినదికి వరద " జల కళ " వచ్చింది. తర్వాత 2015 నవంబర్ లో జల కళతో "కళ కళ"లాడుతోంది. ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరపి లేకుండా కుండపోత వర్షం కురుస్తోంది. కాళంగి రాజర్వాయర్ నుంచి 11 వేల క్యూసెక్కుల నీరు సముద్రానికి వదిలిపెట్టారు,. స్వర్ణముఖినది నుంచి 56 వేల క్యూసెక్కుల నీరు సముద్రం పాలవుతుంది. ఒక్క నవంబర్ నెలలోనే ఇప్పటి వరకు 900 మి.మీల వర్షపాతం నమోదైంది. ముందు జాగ్రత్తగా రేణిగుంట – శ్రీకాళహస్తి మీదుగా రైళ్ళను నడుపుతున్నారు. స్వర్ణముఖినది పొంగి పొర్లుతున్నందున తండోపతండాలుగా జనం వచ్చి చూస్తున్నారు.

### జలదిగ్బంధంలో ప్రజలు

శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లో సుమారు వంద గ్రామాలు జలదిగ్బందంలో ఉన్నాయి. ప్రజల జనజీవనం అతలాకుతలమైంది. ఎడతెరపి లేకుండా వర్షం కురవడంతో పలు కాలనీలు, పలు గ్రామాల ప్రజల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. తినడానికి తిండి లేకుండా చాలా కాలనీల్లోని ప్రజలందరూ చాలా ఇబ్బందులు పడ్డారు. దాంతో స్పందించిన శ్రీకాళహస్తీశ్వరాలయ ట్రస్టుబోర్డు చైర్మన్ పోతుగుంట గురవయ్యనాయుడు, ఆలయ కార్యనిర్వహణాధికారి డి.భ్రమరాంబలు సోమవారం 4 వేల పొట్లాల పులిహోర, 8 వేల సాంబారు అన్నం ప్యాకెట్లను పంపిణీ చేశారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని తొట్టంబేడు మండలం, ఏర్పేడు మండలం, కెవిబిపురం మండలాలలో పలు గ్రామాలకు వెళ్ళలేని పరిస్థితి చోటు చేసుకుంది. చెరువులు ఆనకట్టలు తేగాయి.

### జాయింట్ కలెక్టర్, తెలుగుగంగ ఎస్.ఇ. పరిశీలన

ఎడతెరపి లేకుండా కుండపోతగా కురుస్తున్న భారీవర్షాలకు నియోజకవర్గంలోని ప్రాజెక్టులను చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టర్ భరత్‌గుప్తా, ఇరిగేషన్ ఎస్.ఇ. శ్రీరామకృష్ణరావు, ఇ.ఇ. నజీర్ హుసేన్, రాజేంద్ర ప్రసాద్, విజయకుమార్‌లు కాళంగి రిజర్వాయర్‌ను పరిశీలించారు. వరద తగ్గిన వెంటనే మరమ్మత్తులు చేస్తామన్నారు వారు. చిత్తూరు జిల్లాలో మైనర్ ఇరిగేషన్ పరిధిలోని 8068 చెరువులు రేవాన్ తుఫాన్‌తో నిండాయన్నారు.



### భక్తి శ్రద్ధలతో "గంగమ్మ"కు సారె

స్వర్ణముఖి నది 20 సంవత్సరాల తర్వాత పొంగిపొర్లుతున్నందున " గంగమ్మ " నీ ఆవేశం తగ్గించమ్మా అంటూ " గంగమ్మ "కు సారెను ఇచ్చారు. శ్రీకాళహస్తీశ్వరాలయ ట్రస్టుబోర్డు అధ్యక్షులు గురవయ్యనాయుడు, సభ్యులు బాలాజీ, గుర్రప్పశెట్టి, కంద్రిగ ఉమ, ఆలయ కార్యనిర్వహణాధికారి భ్రమరాంబలు స్వర్ణముఖినదిలో గంగమ్మకు చీర, గాజులు, పసుపు, కుంకుమ, మిగతావన్నీ చాటలో పెట్టి మంగళవాయిద్యాలతో, వేదమంత్రాలు పఠిస్తుండగా గంగమ్మ తల్లికి సారెను సమర్పించారు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఈ వారం ఆర్థికంగానే కాకుండా, వ్యవహారాలలో కూడా ఇబ్బందులుంటాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు అవసరం. వైద్య సాంకేతిక న్యాయవాద, పురోహిత వృత్తుల వారికి మంచి అవకాశాలుండి, ఆదాయము పెరుగుతుంది. ఆస్తి క్రయవిక్రయాలను వాయిదా వేసికొనండి. కోర్టు వ్యవహారాలు వాయిదా పడటం, ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కావడం ఉంటుంది.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

వ్యాపార వర్గాలకు మంచి అవకాశాలుంటాయి. ఆదాయం పెరుగుతుంది. ఆర్థిక లావాదేవీలందు ఇబ్బందులు రాకుండా చూచుకొనండి. అనుకున్న పనులు సరిగా జరగక టెన్షన్ పడుతుంటారు. కుటుంబంలో వారితో అవగాహన సరిగా ఉండక బాధపడతారు. ఉద్యోగార్థులకు అవకాశాలు దొరకవచ్చు. ఖర్చులు పెరిగి అదుపులేకుండా పోతుంది.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఆర్థికంగా నిలద్రొక్కుకుంటారు. చెల్లింపు కొంత జరుపుతారు. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా ఉండి ఆదాయం పెరుగుతుంది. చేపట్టిన పనులను సమర్ధవంతంగా జరుపుతారు. వ్యవహారాలో బంధుమిత్రులు ఇతరుల వత్తిడి ఎక్కువగా ఉంటుంది. జాగ్రత్త పడండి. షేర్లు కొంత సంతృప్తినిస్తాయి. అధికారులు, ఉద్యోగులు ప్రలోభాలకు దూరంగా ఉండండి.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

మీ ఆలోచనలు, ప్రయత్నాలు ఫలించగలవు. ఆర్థిక ఇబ్బందులుండినా సర్దుబాటు చేసికొంటారు. సభలు సమావేశాలలో మీ సలహాలు ఆమోదిస్తారు. వృత్తి వ్యాపారాలలో మంచి అభివృద్ధి ఉండి ఆదాయము పెరుగుతుంది. కొత్త వ్యాపారాలు నిర్మాణాలు ప్రారంభిస్తారు. స్థిరాస్తుల లావాదేవీలు నిర్ణయం కాగలవు. శుభకార్య ప్రయత్నాలు ఫలిస్తాయి. షేర్ల మీద లాభాలుంటాయి.



### బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి – మీ వాసి

తేది. 20.11.2015 నుండి
తేది. 26.11.2015 వరకు

ఈ వారం మీనంలో కేతువు, సింహంలో గురువు, కన్యలో కుజ శుక్ర రాహువులు, వృశ్చికంలో రవిబుధశనులు, కుంభ మీన మేష వృషభములలో చంద్రుడు సంచరిస్తారు.

### పంచాంగము:

తేది 24 బుధవారము కార్తీక పూర్ణిమ

### ముహూర్తములు

తేది 22 ఆదివారం ఉ॥ 10.35 నుండి గంట 12లోగా వివాహ వ్యాపార ఉపనయన అన్నప్రాశనలు మకరలగ్నము.

తేది 26 గురువారము ఉ॥ 10.20 నుండి గంట 12.24లోగా వివాహ వ్యాపార గృహారంభాదులకు మకరలగ్నము. రాత్రి గంట 12.0 నుండి గంట 2.0లోగా వివాహ, గృహప్రవేశములకు సింహలగ్నము.

### కార్తీకమాస శుక్లపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 20 | శుక్ర | నవమి | సా॥ గం.5.42వ॥ |
| తేది. 21 | శని | దశమి | సా॥ గం.3.27వ॥ |
| తేది. 22 | ఆది | ఏకాదశి | ప॥ గం.1.06వ॥ |
| తేది. 23 | సోమ | ద్వాదశి | ఉ॥ గం.10.40వ॥ |
| తేది. 24 | మంగళ | త్రయోదశి | ఉ॥ గం.8.42వ॥ |
| | పిదప | చతుర్దశి | పూర్తిగ |
| తేది. 25 | బుధ | పూర్ణిమ | రా॥ గం.4.20వ॥ |
| తేది. 26 | గురు | పాడ్యమి | రా॥ గం.2.30వ॥ |

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఆర్థిక సమస్యలు క్రమంగా సర్దుకుంటాయి. ఆదాయం సంతృప్తికరం. వ్యాపారాలలో ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగుతారు. కొత్త పరిచయాలు, బంధుమిత్రులను కలుసుకొనడం, శుభకార్యాలలో పాల్గొనడం జరుగుతుంది. వాణిజ్య కాంట్రాక్టు, నిర్మాణ కాంట్రాక్టులకు అనుకూల సమయం. సాంకేతిక, వైద్య, కళా క్రీడా రంగాల వారికి అవకాశాలు బాగుంటాయి.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

పరిచయాలు పెరిగి పదవులు సభ్యత్వాలు పొందుతారు. శుభకార్యముల వల్ల ఖర్చులు, ప్రయాణ శ్రమ ఉంటుంది. ముఖ్య విషయాలలో పట్టు సాధిస్తారు. వ్యాపార వర్గాలకు అవకాశాలు తప్పిపోగలవు. ఆదాయం సామాన్యం. కోర్టు కేసులు వాయిదా పడటం, ప్రభుత్వ అనుమతులందు ఆలస్యం కావడం జరుగుతుంది. కొత్త వ్యాపారాలకు, కాంట్రాక్టులకు అవకాశాలు లభించగలవు.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

కుటుంబ అవసరాలు పెరగడం, అనుకోని ఖర్చులు ఎక్కువగా ఉంటాయి. శుభకార్యాలు నిర్ణయం చేస్తారు. వృత్తి వ్యాపారాలలో అవకాశాలు మెరుగ్గా వుండి ఆదాయం పెరుగుతుంది. అనవసర విషయాలలో తల దూర్చకండి. పెట్టుబడి రంగాలలో అవకాశాలు బాగుండుట, షేర్లు కొద్ది లాభాలు సమకూరడం జరుగుతుంది. బిడ్డల విద్యా, శుభకార్య విషయాలపై శ్రద్ధ చూపుతారు.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

బిల్లుల చెల్లింపులు సకాలంలో జరుపుతారు. ఖర్చులు ప్రయోజనకరంగా ఉంటాయి. వృత్తి వ్యాపారాలలో మంచి అభివృద్ధి వుండి ఆదాయం పెరుగుతుంది. మీ కార్యక్రమాల పర్యవేక్షణ మీరే చేసుకొంటే మంచిది. స్థిరాస్తుల లావాదేవీలు, నిర్మాణాలు చేపట్టుతారు. ఆరోగ్య విషయాలలో జాగ్రత్త అవసరం. విద్యార్థులకు మంచి అభివృద్ధి ఉంటుంది. కుటుంబసౌఖ్యం బాగుంటుంది.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

అనుకున్న పనులను మంచి సామర్థ్యంతో నిర్వహిస్తారు. ఉపాధి వృత్తి పథకాలలో స్థిరపడతారు. వ్యాపార వర్గాలకు ఆదాయం సంతృప్తికరం. ఆహ్వానాలు అందుకుంటారు. వాహనాలు నడిపేవారు యంత్రాల పనులందు జాగ్రత్త అవసరం. వస్తు వాహన రిపేర్ల ఖర్చులుంటాయి. షేర్లు, పెట్టుబడి రంగాలందు అసంతృప్తి వుంటుంది. స్థిరాస్తుల లావాదేవీలు వాయిదా పడటం మంచిది. రావలసిన బాకీలు నిలబడిపోతాయి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

వాయిదా పడిన పనులు మరల కొనసాగుతాయి. ఆర్థికముగా బాగుండి ఆదాయం బాగుంటుంది. వృత్తి వ్యాపారాలలో మంచి అవకాశాలు దొరుకుతాయి. కార్య సామర్థ్యంతో అందరిని మెప్పిస్తారు. దూరప్రయాణాలు నిర్ణయం కాగలవు. రావలసిన బాకీలు అందుతాయి. కోర్టు కేసులందు అనుకూలత, ప్రముఖులను కలుసుకొనడం, సేవా కార్యక్రమాలకు సహాయపడడం చేస్తారు.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఖర్చులు బాగా పెరుగుతాయి. కుటుంబంలో చిన్న చిన్న సమస్యలుంటాయి. వస్తు వాహన రిపేర్లుంటాయి. నిర్మాణాలు చేపట్టగలరు. షేర్లు నిరుత్సాహం కలిగిస్తాయి. వృత్తి జీవనం కలవారికి మంచి అవకాశాలు దొరకడం, ఆదాయం పెరగడం ఉంటుంది. వ్యాపారవర్గాలకు నిరుత్సాహం, సామాన్య ఆదాయముంటుంది. స్టాకిస్టులు, మిల్లర్లపై అధికారుల వత్తిడి ఇబ్బందులుండవచ్చును.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

కుటుంబ ఆర్థిక సమస్యలు సర్దుబాటు కాగలవు. వృత్తి వ్యాపారాలలో అవకాశాలు బాగుండి ఆదాయం పెరుగుతుంది. మీ పనులను మీరే పర్యవేక్షించడం మంచిది. కోర్టు కేసులందు అనుకూలత, రావలసిన బాకీలు వసూలు కావడం, భాగస్వామ్య చర్చలందు పురోగతి ఉంటుంది. అయితే పనులందు టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. ఉద్యోగప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది.

# ఉగ్రవాదం అంతానికి నెల్లూరు ఎంపి2 ఫార్ములా

శ్రీను గల్పిక

జెనీవాలోని ఐక్యరాజ్య సమితి కార్యాలయం. అమెరికా అధ్యక్షుడు ఒబామా, భారత ప్రధాని నరేంద్ర మోడీ, రష్యా అధ్యక్షుడు పుతిన్, ఫ్రాన్స్ అధ్యక్షుడు హోలండ్, బ్రిటన్ ప్రధాని డేవిడ్ కామెరూన్, జర్మనీ ఛాన్సలర్ మోర్కెల్, జపాన్ అధ్యక్షుడు షింజో అబే, చైనా అధ్యక్షుడు జింగ్ పింగ్, పాకిస్థాన్ ప్రధాని నవాజ్ షరీఫ్‌లతో పాటు ఐక్యరాజ్య సమితి ప్రధానకార్యదర్శి బాన్‌కీమూన్, వివిధ దేశాల ప్రతినిధులంతా హాజరై ఉన్నారు. పారిస్‌లో ఐసిస్ ఉగ్ర దాడిపై సమావేశం ఏర్పాటు చేసారక్కడ! సమితి ప్రధాన కార్యదర్శి సమావేశాన్ని ప్రారంభిస్తూ... ఈరోజు టెర్రరిజం ఆ దేశం ఈ దేశం అని లేకుండా అన్ని దేశాలకు పాకుతుంది. కాబట్టి అందరూ కలిసి దీనిపై పోరాడాలి. ఎలా పోరాడాలనే దాని మీద మనమంతా ఒక నిర్ణయానికి రావాలి. కాబట్టి మీ అభిప్రాయాలు, సలహాలు చెప్పండని కోరాడు. మొదట ఒబామా మాట్లాడుతూ... ఏముంది, ఉగ్రవాదులు ఏ దేశంలో నక్కి ఉన్నారంటే ఆ దేశంపై అందరం కలిసి బాంబులు వేయడమే. ఇరాక్, ఆఫ్ఘనిస్థాన్‌లలో మేం చేసింది ఇదే కదా అని అన్నాడు. ఆ మాటకు చైనా అధ్యక్షుడు జింగ్ పింగ్ లేచి... అలా చేస్తే సామాన్య ప్రజలు కూడా చనిపోతారుగా అని సందేహం వెలిబుచ్చాడు. ఒబామా స్పందిస్తూ... వందమంది దోషులు తప్పించుకున్నా ఫర్వాలేదుగాని ఒక్క నిర్దోషికి శిక్ష పడకూడదని చెప్పిన ఇండియన్ లా నుండి మేమొక కొత్త వ్యాఖ్యాన్ని కనిపెట్టాము, వందమంది సామాన్యులు చచ్చిపోయినా ఫర్వాలేదు గాని ఒక్క టెర్రరిస్ట్ కూడా తప్పించుకోకూడదనేది మా అమెరికన్ పాలసీ అని చెప్పాడు. షింజో అబే వుండి... దీనివల్ల తీవ్రవాదం అంతకంత పెరగడమేగాని తగ్గిన దాఖలాలు లేవని చరిత్ర మనకు చెబుతోంది. హింసకు ప్రతిహింస సమాధానం కాదు, దాని వల్ల సత్ఫలితాలు వచ్చిన దాఖలాలు కూడా లేవు. కాబట్టి కొత్త మార్గం ఆలోచిద్దామన్నాడు. వెంటనే మోర్కెల్ లేచి... నేను ఇటీవలే ఇండియాలో పర్యటించాను, అక్కడ కొన్ని విషయాలు గ్రహించాను. అక్కడ లొంగిపోయిన తీవ్రవాదులకు భూములు, నగదు బహుమతులు, ఇతర బెనిఫిట్స్ ఇస్తుంటారు. మనం కూడా అలాగే లొంగిపోయిన టెర్రరిస్టులకు ఖరీదైన ఫ్లాట్లు, కార్లు, నగదు, ఫారిన్ ట్రిప్‌లు వంటి ఆఫర్లు ప్రకటిద్దామని ప్రతిపాదించింది. అందుకు బాన్‌కీమూన్... డబ్బు, ఆస్తుల మీద ధ్యాస వుండే వాళ్లు ఈ పని చేయరు మేడమ్, ఇంకేదన్నా కొత్త కోణంలో ఆలోచించండని చెప్పాడు. అప్పుడందరూ కళ్లు మూసుకుని వున్న నరేంద్ర మోడీ వైపు చూసారు. ఒబామా ఆయనను తట్టాడు... మోడీ కళ్లు తెరిచాడు. ఏం అలసిపోయి నిద్రపోతున్నావా అని ఒబామా అడిగాడు. లేదు యోగనిద్రలో వుండి ఈ సమస్యకు పరిష్కారమేంటా... అని ఆలోచిస్తున్నానని అన్నాడు. మా ఐడియాలేవీ వర్కవుట్ కావడం లేదు. మీ ఐడియానన్నా ఈ ప్రపంచాన్ని మారుస్తుందేమో... మీ ఐడియా ఏంటో చెప్పండని ఒబామా అడిగాడు. దీనికి నా బుర్ర ఒకటే ఆలోచిస్తే చాలదు అంటూ మాటల యంత్రం వెంకయ్యనాయుడుకు ఫోన్ చేసి సమస్య గురించి చెప్పాడు. వెంకయ్య ఫోన్‌లోనే ఏదో చెప్పాడు. మోడీ ఆనందంగా ఫోన్ పెట్టేసి... ఓ రెండు నెలల గడువివ్వండి. ఈ ఉగ్రవాద ఆగడాలను లేకుండా చేస్తాం, అని అన్నాడు. ఆ మాటకు పక్కనే వున్న నవాజ్‌షరీఫ్... కొంపదీసి మా మీదకు గాని యుద్ధానికి రారు కదా అని ఆందోళనగా అన్నాడు. దానికి మోడీ భుజబలంతో కాదు, మేం బుద్ధిబలంతో ఈ ఉగ్రవాదాన్ని నిర్మూలిస్తామంటూ లేచాడు. ఆత్మవిశ్వాసానికి అరవై అడుగుల నిలువెత్తు ప్రతిమలా వుండే మోడీ మాటలకు అన్ని దేశాల అధినేతలు కూడా గుండెల మీద చేతులేసుకుని ధైర్యంగా తిరిగి వెళ్లారు.

★★★★★

రెండు నెలలు గడిచాయి. ప్రపంచంలో ఎక్కడా ఉగ్రదాడులు లేవు, కిడ్నాప్‌లు, బాంబు పేలుళ్లు లేవు. ఉగ్రవాదుల అడ్రస్ కూడా లేదు... ఏమయ్యారు, ఏమైపోయారు, సిరియా, ఇరాక్, ఆఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్ వంటి దేశాలు ప్రశాంతంగా వున్నాయి. మీడియా అంతటా ఇదే చర్చ. మానవ హక్కుల వాళ్లయితే ఉగ్రవాదులను రహస్యంగా మట్టుబెట్టారా? అలా చేస్తే హక్కుల ఉల్లంఘనే అంటూ ప్రకటనలు ఇవ్వసాగారు.

★★★★★

రెండు నెలల తర్వాత...

ఐక్యరాజ్య సమితి కార్యాలయంలో అన్ని దేశాల అధినేతలు ఉన్నారు. ఒబామా లేచి... మోడీ యూ ఆర్ గ్రేట్. ఈ మిరాకిల్ ఎలా సాధ్యమైంది, మీరు ఏం మాయ చేసారు మోడీజీ... అని అడిగాడు. దానికి మోడీ... ఇది నా గొప్పతనం కాదు, మా దేశంలో 'నెల్లూరు' అనే వరల్డ్ క్లాస్ సిటీ వుంది. ఆ నగరపాలక సంస్థ వారి గొప్పతనమదని అన్నాడు. ఏమా నెల్లూరు... ఏమిటి వారి గొప్పతనం అని అందరూ కోరస్‌గా అడిగారు. ఇది చెపితే అయ్యేది కాదు, చూపిస్తాను అంటూ మోడీ తన ల్యాప్‌టాప్ ఓపెన్ చేసాడు.

★★★★★

ఐఆర్ 20-420 ముదురుదోమల ఉత్పత్తి కేంద్రమైన నెల్లూరు నగరపాలక సంస్థలోని కౌన్సిల్ హాల్. ప్రధాని నరేంద్ర మోడీ, దేశ రక్షణ మంత్రి మనోహర్ పారికర్, హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి యం.వెంకయ్యనాయుడులతో నెల్లూరు మేయర్ అజీజ్, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పి.అనిల్‌కుమార్‌యాదవ్, స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకా(64+), కలెక్టర్ యం.జానకి, ఎస్పీ గజరావ్‌భూపాల్, కమిషనర్ పివిఎస్ మూర్తిలు సమావేశమై వున్నారు. వెంకయ్యనాయుడు సమస్యను వివరించాడు. ప్రపంచ దేశాలన్నీ ఉగ్రవాదాన్ని నిర్మూలించే బాధ్యతను మోడీ మీద పెట్టారు. ఆయన ఆ బాధ్యతను మనకు అప్పగిస్తున్నారు. ఇందుకు మీరు సిద్ధమేనా అని అడిగాడు. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వుండి... సార్, ప్రపంచ శాంతి కోసమే మా కార్పొరేషన్ వాళ్లు ముదురు దోమలు, బలిసిన పందులను పెంచుతున్నారు. మీరు ఇళ్లకు వెళ్లి తడి గుడ్డ తలకు చుట్టుకుని పడుకోండి. ఆ పని మేం చూసుకుంటామని చెప్పాడు. వివేకా హ్యాండ్ ప్యాక్ సిగరెట్ చుట్టుకుంటూ... దీని కోసం మీరింత దూరం రావాలా... ఫోన్‌లో చెబితే పోయేది కదా... అయినా మీరు నిశ్చింతగా వెళ్లండని భరోసా ఇచ్చాడు. దాంతో మోడీ బృందం ఢిల్లీకి పయనమైంది.

ఇక్కడితో ల్యాప్‌టాప్ దృశ్యాలు అయిపోయాయి. ఒబామా వుండి... బాహుబలి పార్ట్-1 సినిమా చూసినట్లుంది, అసలు సబ్జెక్ట్ ఏమైందని అడిగాడు. మోడీ బదులిస్తూ... మీకిచ్చిన మాట ప్రకారం నెల్లూరు కార్పొరేషన్ వాళ్లు యం.పి-2 ఆపరేషన్(ముదురు దోమలు - పందులు)కు శ్రీకారం చుట్టారు. 10 టన్నుల దోమలను, 10వేల పందులను పట్టుకుని విమానాలు, హెలికాప్టర్‌ల ద్వారా సిరియా, ఆఫ్ఘనిస్థాన్, ఇరాక్, పాకిస్థాన్ దేశాలలో వదిలాము. ఆ ముదురు దోమలు, పందుల వల్ల అక్కడ విషజ్వరాలు ప్రబలాయి. సామాన్య పౌరులతో పాటు ఉగ్రవాదులకు కూడా డెంగీ జ్వరాలొచ్చాయి. వాళ్లంతా నీరసపడి ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. వాళ్లకిక తుపాకులు పట్టుకునే శక్తి కూడా లేదు. ఈ ఉగ్రవాదులెలాగూ చికిత్స కోసం ఆసుపత్రులకు రావాల్సిందే! మిలిటరీ వాళ్ళని సులభంగా గుర్తించి పట్టుకుంటుంది. మిలటరీకి మాత్రం ఈ జ్వరాలు రాకుండా ముందుగానే హోమియోపతి మందులు పంపిణీ చేసాం. కాబట్టి ఇబ్బంది లేదని చెప్పడంతో ఆ హాల్ చప్పట్లతో మార్మోగిపోయింది.

# కళ్యాణ వైభోగం...!




'లాయర్' వారపత్రిక సబ్ఎడిటర్ మద్దూరు శ్రీనివాసులు - సుగుణల కుమార్తె **కవిత - శివకుమార్** (వెంకటగిరి వాస్తవ్యులు బారు కృష్ణయ్య - కృష్ణమ్మల కుమారుడు)ల కల్యాణం నవంబర్ 18వ తేదీ నెల్లూరులోని బిఎం కన్వెన్షన్ హాల్లో జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.



ఇందుకూరుపేట మండలం, గంగపట్నం వాస్తవ్యులు కొండూరు విజయశేఖర్‌రెడ్డి - పద్మజల కుమార్తె **లాస్య - రాజేష్‌కుమార్** (తిరుపతి వాస్తవ్యులు గుండ్రా సిద్ధారెడ్డి - పద్మావతిల కుమారుడు)ల వివాహం ఈ నెల 18వ తేదీ నెల్లూరు కస్తూరిదేవి గార్డెన్స్‌లో జరిగింది. కొత్తజంటకు 'లాయర్' శుభాభినందనలు.



నెల్లూరు నవలాకులతోట వాస్తవ్యులు పొలగిరి నాగిరెడ్డి - కాంతమ్మల కుమారుడు **రమేష్‌రెడ్డి - తేజశ్వి** (పొదలకూరు మండలం సూరాయపాలెం వాస్తవ్యులు నందూరు శ్రీనివాసులురెడ్డి - సుజాతమ్మల కుమార్తె)ల పెళ్ళి ఈ నెల 13వ తేదీ నెల్లూరు పురమందిరం నందు జరిగింది. నవదంపతులకు 'లాయర్' దీవెనలు.



నెల్లూరు కొత్తూరు వాస్తవ్యులు ఉమ్మడిశెట్టి పెంచలనరసింహులు - సంపూర్ణల కుమారుడు **పెంచల ప్రసాద్ - లతాశ్రీ** (తిరుపతి వాస్తవ్యులు అల్లం ఆదికేశవులు - ఇంద్రాణిల కుమార్తె)ల పరిణయం ఈ నెల 15వ తేదీ తిరుపతిలోని శ్రీనివాస కల్యాణ మండపం నందు జరిగింది. నూతన జంటకు 'లాయర్' శుభాశీస్సులు.

# బాధితులకు బాసటగా ప్రతాప్



## కావలి కబుర్లు

కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి బుధవారం బోగోలు మండలంలోని ముంపు ప్రాంతాలైన ముంగమూరు, టెంకాయచెట్లపాళెం, జువ్వలదిన్నె గ్రామాల్లో పర్యటించారు. చిప్పలేరు మీదుగా బోటులో ఆయన జువ్వలదిన్నెకు చేరుకుని బాధితులను పరామర్శించారు. ముంగమూరు పంచాయితీలో కూలిన రెండవ వంతెనను ఆయన పరిశీలించారు. టెంకాయచెట్లపాలెంలో గిరిజనులు, మత్స్యకారులు పడుతున్న ఇబ్బందులను చూసి వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట తహశీల్దార్ జయప్రకాష్, మండల ప్రత్యేకఅధికారి ప్రసాద్‌బాబు, ఎంపిపి సులోచనమ్మ, ఎంపిడిఓ వి.వి. శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆదరించే కథలతోనే సినిమా తీస్తా!

**- సినీ దర్శకులు శేఖర్ కమ్ముల**



నేటి ప్రజలు ఎలాంటి సినిమాలను ఆదరిస్తారో అలాంటి కోణాల్లోనే కథలు వ్రాసుకుని సినిమాలు తీస్తానని ప్రముఖ సినీ దర్శకులు శేఖర్ కమ్ముల పేర్కొన్నారు. 14వ తేదీ స్థానిక విశ్వోదయ కళాశాలలో జరిగే వార్షిక వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టుకతోనే ఎవ్వరూ నటులుగా పుట్టరని, సాధన ద్వారా మనిషి చేయలేని పని లేదన్నారు. స్థానిక విశ్వోదయ ఎంఎం హాలులో డా॥ రామ్‌సెంటర్ ఆధ్వర్యంలో విశ్వోదయ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు విచిత్ర వేషధారణ పోటీలు నిర్వహించారు. విజేతలకు వారి తల్లిదండ్రులతో పాటు స్టేజీపై బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ జీవితంలో క్రమశిక్షణ ఉన్నప్పుడే మంచి సినిమాలు సమాజానికి అందించగలమని సూచించారు. యు.యస్.లో కంప్యూటర్ సైన్స్‌లో పిజి చేసిన నేను ఆ కాలేజీలో చదువు, ఆటలు, సంతోషాలను తలచుకుంటూ హ్యాపీడేస్ సినిమా తీయడంతో మంచి ఆదరణ పొందానన్నారు. రామ్‌సెంటర్ డైరెక్టర్ కూనం తాతిరెడ్డి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి, రచయిత ఖదీర్‌బాబు, రామ్‌సెంటర్ ఛైర్మెన్ దొడ్ల మనోహర్‌రెడ్డి, కన్వీనర్ రమణయ్య, అధ్యాపకులు జె.కృష్ణప్రసాద్, జ్యోతిశ్రీ, పిడిలు డా॥ ప్రసాద్‌రెడ్డి, ఆర్.మాల్యాద్రి, సీనియర్ ఎన్‌సిసి కన్వీనర్ మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛకావలి సాధనకు కృషి

**- టిడిపి పట్టణ అధ్యక్షులు మలిశెట్టి**



కావలి పట్టణాన్ని స్వచ్ఛమైన ప్రాంతంగా తీర్చి దిద్దేందుకు పట్టణంలోని అన్ని వార్డుల నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని టిడిపి పట్టణ అధ్యక్షులు మలిశెట్టి వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మలిశెట్టి అధ్యక్షతన పట్టణ అభివృద్ధి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పట్టణంలో పారిశుద్ధ్యంపై ఎక్కువ దృష్టి సారించాలన్నారు. పారిశుద్ధ్య లోపం వలన విషజ్వరాలు ప్రబలుతున్నాయని, వాటిని నివారించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. 40వార్డుల్లోని నాయకులు, కార్యకర్తలు, ప్రజలు దృష్టిసారిస్తే స్వచ్ఛకావలి సాధన సాధ్యమవుతుందన్నారు. అలాగే సంగం బ్యారేజీ వద్ద వున్న వరద నీటిని కాలువ ద్వారా కావలి చెరువుకు నింపాలన్నారు. కావలి చెరువుకు వరద నీటిని మళ్లించే విషయంలో మాజీఎమ్మెల్యే, రాష్ట్ర రాజధాని నిర్మాణ కమిటి సభ్యులు బీద మస్తాన్‌రావు, టిడిపి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే బీద రవిచంద్రల కృషి ప్రశంసనీయమన్నారు. పట్టణంలో అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు, ప్రముఖ న్యాయవాది పోట్లూరి శ్రీనివాసులు, గుత్తికొండ కిషోర్, గాదంశెట్టి వేణు, కవితా ప్రసాద్, హరిబాబు నాయుడు, ఎం.సుకుమార్, ఎస్.నారాయణ, పి.నాగరాజు, టి.ప్రసాద్, కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏరియా వైద్యశాలలో ఆర్‌డి శాలినీదేవి ఆకస్మిక తనిఖీలు

కావలి ఏరియా వైద్యశాలను వైద్యశాఖ గుంటూరు రీజనల్ డైరెక్టర్ డాక్టర్ డి.శాలినీదేవి ఆదివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసుపత్రిలోని డాక్టర్లు అంకితభావంతో, చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన "సురక్షిత ప్రసవం - తల్లీ బిడ్డా క్షేమం" అనే కార్యక్రమంలో భాగంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో కావలసిన అత్యవసర వస్తువులను త్వరలో సమకూరుస్తామన్నారు. ఏరియా వైద్యశాలలో నెలకు ఎన్ని కాన్పులు చేస్తున్నారో వాటి వివరాలను సేకరించి ప్రభుత్వానికి సమాచారం పంపుతామన్నారు. మాతృ, శిశు మరణాలు తగ్గించాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నెల్లూరుజిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ ఎడివి లక్ష్మి, సూపరింటెండెంట్ డా॥ మండవ వెంకటేశ్వర్లు, డా॥ సురేష్‌బాబు, డా॥ కోటేశ్వరరావు, డా॥ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# ఊర్లు ఏరులయ్యాయి!

(మొదటి పేజీ తరువాయి)

మొన్నటి దాకా ఎండలు మండు వేసవిని తలిపించాయి. చిత్తకార్తెలో కూడా చినుకు రాల్లేదు. ఈ సంవత్సరం కరువు తప్పదా... ఈ చంద్రబాబు వస్తేనే వర్షాలు పడవు అంటూ జనం తిట్లు మొదలుపెట్టారు. ఉన్న చివరి ఆశల్లా స్వాతి, విశాఖ కార్తెలే! వరుణుడికి జాలి కలిగిందేమో... 'రోవాన్' తుఫాన్ రూపంలో కరుణించాడు. కుండపోతలా వర్షం కురిపించాడు. మొదట 'రోవాన్' తుఫాన్ మూలంగా మూడు రోజులు వర్షాలు బాగానే పడ్డాయి. చెరువుల్లో, బావుల్లో నీళ్లు బాగానే చేరాయి. కాకపోతే సోమశిల, కండలేరుల్లో తగిన నీటి సామర్థ్యం లేదని కాస్త వెలితి. ఈలోపు బంగాళాఖాతంలో మరో అల్పపీడనం. 15వ తేదీ మధ్యాహ్నం జడి పట్టింది. 15, 16, 17, 18తేదీల్లో నెల్లూరుజిల్లా మీద నీటిని కుమ్మరించినట్లే వర్షాలు కురిసాయి. ఇక వానలు వద్దని జనం వాన దేవుడికి మొరపెట్టుకునే స్థాయిలో కురిసాయి. వానలతో వరదలొచ్చాయి. నదులు, వాగులు, వంకలు పొంగిపొర్లాయి. చిన్నవాగులు సైతం పెద్ద నదులను తలపిస్తూ ప్రవహించాయి. జనజీవనం అస్తవ్యస్థంగా మారింది.

జిల్లాలో కురిసిన భారీ వర్షాల మూలంగా వందలాది గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ప్రజలు ఇళ్ల నుండి బయటకు రాలేని పరిస్థితి. తిండి తిప్పలకు అగచాట్లు... పంటలు భారీ నష్టం. దాదాపు 20మంది దాకా వర్షాలకు మృతి చెందారు. పలుచోట్ల నీళ్లలో చిక్కుకున్న వారిని పోలీసులు సురక్షిత ప్రాంతాలకు చేర్చారు.

## స్థంభించిన రవాణా

భారీ వర్షాలకు ఎక్కడిక్కడ రోడ్లు, రైలు కట్టలు తెగిపోవడంతో రవాణా స్థంభించిపోయింది. మనుబోలు వద్ద వరద ఉధృతికి జాతీయ రహదారి కల్వర్ట్ కొట్టుకుపోయింది. దీంతో జాతీయ రహదారి మీద వేలాది వాహనాలు ఎక్కడివక్కడ నిలిచిపోయాయి. 19వ తేదీ ఈ గండిని పూడ్చి రాకపోకలను పునరుద్దరించేందుకు తీవ్ర ప్రయత్నాలు జరిగాయి. నెల్లూరు నుండి చెన్నై, తిరుపతిల మధ్య రాకపోకలు బంద్ కావడంతో వేలాది ఆర్టీసీ బస్సులను నిలిపి వేసారు. వెంకటగిరి, తడ ప్రాంతంలో వరద ఉధృతికి రైలు కట్టలు దెబ్బతినడంతో తిరుపతి, చెన్నైల వైపు వెళ్లే రైళ్లను నిలిపి వేసారు. కేవలం గూడూరు వరకు మాత్రమే రైళ్లను నడిపారు. వెంకటగిరి మార్గంలో రోడ్డు దెబ్బతింది. నెల్లూరు, ఆత్మకూరు రోడ్డు తెగిపోయింది. జిల్లాలోని పలు గ్రామాలకు రాకపోకలే లేవు. ప్రతి పనికి పట్టణానికి వెళ్లాల్సిన వారి పరిస్థితి దయనీయంగా వుంది. మార్గమధ్యంలో చిక్కుకుని రైళ్లలో, లారీలలో, బస్సుల్లో ప్రయాణీకులు నానా అగచాట్లు పడ్డారు.

గత 20ఏళ్లలో ఎన్నడూ లేని రీతిలో జిల్లాను వర్షాలు ముంచెత్తాయి. పెన్నానది ప్రవహించింది. బ్యారేజీ నిర్మాణంలో ఉండడం, ఆనకట్ట తెగిపోయి వుండడంతో వరద నీరంతా సముద్రం పాలయ్యింది. స్వర్ణముఖి, కాళంగినదులు పొంగి ప్రవహించాయి. కడప జిల్లాలోనూ భారీ వర్షాలు కురవడంతో సోమశిల నీటి మట్టం పెరుగుతోంది. జిల్లాలో దాదాపు చెరువులన్నీ నిండిపోయాయి. వరద ప్రవాహంలో దాదాపు 350 చెరువుల వరకు గండ్లు పడ్డాయి. నాయుడుపేట - గూడూరు డివిజన్‌లలో అత్యధిక వర్షపాతం నమోదైంది. చరిత్రలో ఈ తరం వారు చూడని విధంగా వెంకటగిరి సమీపంలోని కైవల్యా నది ఉధృతంగా ప్రవహించింది.

## ఏరా... నెల్లూరా?

ఈ తరంవాళ్లు ఎప్పుడూ చూడని విధంగా ఈ వర్షాలతో నెల్లూరు ముంపుకు గురైంది. భారీ వర్షాలు నెల్లూరు నగరాన్ని వణికించాయి. మురికితో నిండి వుండే డ్రైనేజీ కాలువలు నదులను తలపించాయి. పెన్నానదిలో ఎన్ని క్యూసెక్కుల నీళ్లు ప్రవహించి ఉంటాయో, నెల్లూరు నగర రోడ్ల మీద కూడా అన్ని క్యూసెక్కుల నీళ్లు ప్రవహించి వుంటాయని చెప్పొచ్చు. యధాపలంగా నగరంలోని అన్ని అండర్‌బ్రిడ్జిలలో నీళ్లు నిండిపోయి రాకపోకలు స్థంభించాయి. నగరంలో అత్యంత ఖరీదైన ప్రాంతంగా చెప్పుకో బడే మాగుంట లే అవుట్ అయితే చెరువులాగా మారిపోయింది. ఈ లే అవుట్‌లోని అపార్ట్‌మెంట్లన్నింటిలో నీళ్లు చేరాయి. ప్రధాన రోడ్లతో పాటు చిన్న రోడ్లలో కూడా మోకాటి లోతు నీళ్లు ప్రవహించాయి.

## ప్రమాదకర స్థాయిలో స్వర్ణాల చెరువు

నెల్లూరులోని స్వర్ణాల చెరువు నీటి మట్టం ప్రమాద స్థాయిలో వుంది. ఇంత వానొస్తుందని, చెరువుకు ఇన్ని నీళ్లొస్తాయని ఎవరూ వూహించలేదు. కాని గత కొన్నేళ్లలో ఎప్పుడూ లేని విధంగా నెల్లూరు చెరువు నిండిపోయింది. ఇంకా వానలు కురిస్తే చెరువు పరిస్థితి ఆందోళన కరమే!

ఈ జీవితానికి చాలుగా అనే స్థాయిలో నెల్లూరు జిల్లాను వానలు ముంచెత్తాయి. ఈ వానల నుండి తెప్పరిల్లుకోవడానికి, కోలుకోవడానికి ఇంకొంత సమయం పట్టొచ్చు. మొన్నటిదాకా ఒక్క పదును వాన కురిస్తే చాలనుకున్నాం. ఇప్పుడు వానలు వదిలిపోతే చాలనుకుంటున్నాం. అంతా ప్రకృతి మాయ!

## అయ్యో... రైతన్న!

నిన్నటి దాకా రైతులు వర్షాల కోసం ఎదురుచూసారు. నీళ్లుంటే తమ కడగండ్లు గట్టెక్కుతాయని ఆశపడ్డారు. నీళ్లు లేకున్నా కష్టమే, నీళ్లు ఎక్కువైనా నష్టమే అన్నట్లుగా రైతుల పరిస్థితి మారింది. జిల్లాలో దాదాపు 35వేల హెక్టార్లలో పంటల నష్టం వాటిల్లినట్లుగా తెలుస్తోంది. 2వేల ఎకరాలకుపైగా ఆక్వాసాగు దెబ్బతింది. దాదాపు ఆక్వాలోనే వెయ్యికోట్ల నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. ఈ భారీవర్షాల మూలంగా ఎన్ని వేలకోట్ల నష్టం వాటిల్లిందనేది అంచనా వేయడం అప్పుడే కష్టం.

ఇక సంతోషించాల్సిన విషయం ఏమిటంటే జిల్లా రైతాంగానికి కల్పతరువైన సోమశిల, కండలేరు రిజర్వాయర్లలో నీటి మట్టాలు పెరుగుతుండడం.









# వరద బాధితులను ఉదారంగా ఆదుకోండి



నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని కొత్తూరు, చవటమిట్ట గిరిజన కాలనీ ప్రాంతంలో నీటమునిగిన వర్షం బాధిత ప్రజలను సురక్షిత ప్రాంతంలో ఉంచి గత మూడు రోజులుగా వారికి సంబంధించిన సహాయచర్యలను ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు. 19వతేదీ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరాశ్రయులకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమం నెల్లూరు ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి చేతుల మీదుగా జరిగింది.

ఈ సందర్భంగా ఎంపి రాజమోహన్ రెడ్డి మాట్లాడుతూ నెల్లూరుజిల్లాలో కురిసిన వర్షాలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నెల్లూరు రూరల్‌లో ఎక్కడెక్కడ వర్షం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో తెలుసుకొని కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి స్వయంగా ఆ ప్రాంతానికి చేరుకొని వారికి కావలసిన సహాయక చర్యలను ఏర్పాటు చేయడం ఎంతో అభినందించదగ్గ విషయమని, ప్రతి నియోజకవర్గంలో కూడా అందరూ ఇదే విధంగా పనిచేయాలన్నారు. అధికారులు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చేస్తున్న సేవలను ఆదర్శంగా తీసుకొని మానవతా దృక్పథంతో ప్రజలకు అండగా ఉండాలని కోరారు.

ఈ సందర్భంగా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ నెల్లూరుజిల్లాలో కురుస్తున్న వర్షాలు మామూలు వర్షాలు కాదని, గతంలో ఎప్పుడూ ఇంత భారీ స్థాయిలో వర్షాలు పడి ప్రజలను ఇబ్బంది పెట్టలేదని, ఎంతోమంది ప్రజలు నిరాశ్రయులయ్యారన్నారు. ఈ తుఫాను వల్ల ముఖ్యంగా నెల్లూరురూరల్ నియోజకవర్గంలోని ప్రజలు ఎక్కువుగా అన్ని రకాలుగా నష్టపోయారని, నిలువ నీడలేక రోడ్డు మీద పడ్డారని, వారందరికి చేతనైనంత వరకు తానే స్వయంగా సహాయక చర్యలను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నాని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట వైయస్సార్సీపీ నాయకులు కమల్‌రాజ్, వంశీ, నవీన్‌రెడ్డి, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

## కాలధర్మం

### నాగారెడ్డి హరిశ్చంద్రారెడ్డి



గాంధేయవాది, కాంగ్రెస్ నాయకుడు, నెల్లూరు జిల్లాలోచాలామందికి సుపరిచితుడు నాగారెడ్డి హరిశ్చంద్రారెడ్డి ఈ నెల 16వ తేదీ సోమవారం కన్నుమూసారు. ఆయన వయసు 80సంవత్సరాలు. ఆయనకు ముగ్గురు కుమారులు కాగా వారిలో ఒకరు రోడ్డు ప్రమాదంలో మరణించారు. తోటపల్లిగూడూరు మండలం మాచర్లవారిపాలెం ఆయన స్వగ్రామం. రైతు కుటుంబంలో జన్మించిన ఆయన విద్యార్థి దశలోనే గాంధేయవాదం పట్ల ఆకర్షితులై ఎప్పుడూ ఖద్దరు ధరించేవారు. ఇంటర్మీడియట్ చదివేటప్పుడు విద్యార్థి కాంగ్రెస్‌కు నాయకుడిగా వ్యవహరించారు. ఆ తర్వాత యువజన కాంగ్రెస్ నాయకుడిగా చెకోస్లేవియా, యుగోస్లోవియా, జర్మనీ, జపాన్, సింగపూర్ దేశాలలో పర్యటించారు. మాజీమంత్రులు స్వర్గీయ ఏ.సి.సుబ్బారెడ్డి, ఆనం వెంకటరెడ్డిలకు ఆయన అత్యంత సన్నిహితుడు. వారు పోటీ చేసిన అన్ని ఎన్నికలను ఈయనే స్వయంగా పర్యవేక్షించాడు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్‌గా, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ వైస్‌ఛైర్మెన్‌గానూ పని చేసి, ఎంతో మందికి ఉద్యోగాలిప్పించారు. భూమి తనఖా బ్యాంకు ఛైర్మెన్‌గా కూడా పని చేశారు. ఏ.సి సంపూజనా సమితిని స్థాపించి ఆ సంస్థకు తానే అధ్యక్షుడిగా వ్యవహరిస్తూ ప్రతి సంవత్సరం ఏసి సుబ్బారెడ్డి జయంతి, వర్ధంతులను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు. ఏసి సుబ్బారెడ్డి మీద ప్రత్యేక పుస్తకాన్ని తీసుకురావాలని గత కొన్నేళ్లుగా ఆయన ప్రయత్నిస్తూ ఆ పనుల్లో వున్నారు. అయితే ఆ కల నెరవేరకుండానే కన్ను మూసారు. ఆయన మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

## • నీళ్ళూరుగా నెల్లూరు



# నగరమా... ఇది నరకమా?

**నెల్లూరులో ఇలాంటి వానలు ఎప్పుడూ చూడలేదు. ఇంత ముంపును ఎవ్వరూ ఊహించలేదు. ఎక్కడెక్కడో పట్టణాలలో వర్షాలు వచ్చినప్పుడు రోడ్లు వాగులు కావడం టివీల్లో చూసారుగాని, నెల్లూరు నగరంలోనే అంతటి దారుణ పరిస్థితులను ఇప్పుడు ప్రత్యక్షంగా చూశారు.**



నగరంలో సురక్షిత ప్రాంతమన్నదే లేదని ఈ వర్షాలు నిరూపించాయి. నగరంలో ఖరీదైన ప్రాంతంగా చెప్పుకోబడే మాగుంట లే అవుట్ సైతం ముంపుకు గురైంది. ఈ కాలనీలో రోడ్లన్నీ జలమయమై ఇళ్లల్లోకి, అపార్ట్‌మెంట్లలోకి నీళ్లు చేరాయి. ఇక ప్రధాన రోడ్లల్లో అయితే నడుములోతు నీళ్లు పారుతూ వాగులను తలపించాయి. నెల్లూరు చెరువు అలుగులు పారడంతో నగరంలో డ్రైనేజీ కాలువలుగా రూపాంతరం చెందిన పంట కాలువలన్నీ పోటెత్తి ప్రవహించాయి. రోడ్డేదో వాగేదో తెలియని గందరగోళ పరిస్థితి నగరంలో నెలకొంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల మూలంగా సింహపురి జలసంద్రంలో మునిగిపోయింది. బుధవారం తెల్లవారుజాము నుంచి కురిసిన వర్షాలకు నెల్లూరు నగరం పూర్తిగా జలమయమైంది. మురుగు కాలువలు లేకపోవడం, ఉన్న పంటకాలువలు ఆక్రమణలకు గురికావడంతో వర్షపునీరు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. జనం ఎటూ వెళ్ళలేని పరిస్థితి. నీళ్లు వెళ్లేందుకు ఉన్న మార్గాలన్నీ మూసుకుపోవడంతో వాన నీరు రోడ్లు, నివాసాలు, వ్యాపారదుకాణాలు, కార్యాలయాలు, ఆసుపత్రులను ముంచెత్తాయి. ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లే మార్గాలన్నీ మూసుకుపోవడంతో నగరవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భారీవర్షాలకు నగర శివారు ప్రాంతాలైన బుజబుజనెల్లూరులోని ఆర్టీసీ కాలనీ, నాగమ్మ కాలనీ, యాదవపాళెం జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఎగువ ప్రాంతాల నుంచి వరదనీరు ఉధృతంగా రావడంతో ఇళ్లలోకి నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విక్రమ్‌నగర్, డ్రైవర్స్ కాలనీ, జనశక్తినగర్ తదితర ప్రాంతాల్లోని ఇళ్లల్లోకి విషసర్పాలు రావడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. నెల్లూరు అయ్యప్పగుడి వద్దనున్న పోలీస్‌స్టేషన్ వద్ద నుంచి జాతీయ రహదారి వరకు నడుములోతు వరకు నీరు రావడంతో పోలీసులు ముందు జాగ్రత్తగా వాహనాలను మధ్యాహ్నం వరకు నిలిపి వేశారు. జాతీయ రహదారిపై చెన్నై వైపు వాహనాలు వెళ్ళకుండా ఆపేశారు. దీంతో ట్రాఫిక్ ఎక్కడికక్కడే ఆగిపోయింది. వాహనాలు బారులు తీరాయి. నెల్లూరు మూలాపేట నీలగిరి సంఘం వద్ద నెల్లూరు చెరువు నిండిపోయి అందులోంచి కలుజులోకి నీరు పొంగిపొర్లడంతో కాలువలన్నీ నిండిపోయి పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. రాజీవ్‌గృహకల్ప జల దగ్బంధంలో చిక్కుకుంది. అనగుంట, పడారుపల్లి, టైలర్స్ కాలని, కాకుపల్లి, మల్లాయగుంట, సమ్మర్ స్టోరేజీ తదితర ప్రాంతాలు నీటిలో చిక్కుకున్నాయి. ఆయా ప్రాంతవాసులను పునరావాసాలకు తరలించి ఆహారపొట్లాలు, వాటర్ ప్యాకెట్లను అధికారులు అందజేశారు.

నెల్లూరు నగరం చుట్టూ వర్షపునీరు ప్రవహించడంతో ప్రజలు నానా అవస్థలు పడ్డారు. విజయమహల్ గేట్ వద్ద గల అండర్‌బ్రిడ్జి నీటితో నిండిపోయింది. మాగుంట లే అవుట్ రోడ్లు మునిగిపోయాయి. బివి నగర్, వనంతోపు, ప్రభుత్వాసుపత్రి ఎదురు రోడ్లలో మోకాలి లోతులో నీరు నిలిచింది. మూలాపేట సిఏఎం హైస్కూలు, జిల్లా కోర్టు రోడ్డు, వహాబ్‌పేట తదితర ప్రాంతాలను వర్షపునీరు చుట్టు ముట్టింది. గాంధీబొమ్మ సెంటర్, విఆర్‌సి, మద్రాసుబస్టాండ్, ఆర్టీసి సెంటర్లలో వర్షపు నీరు పోటెత్తింది.

ఆత్మకూరు బస్టాండ్, రామలింగాపురం, విజయమహల్‌గేటు, మాగుంట లే అవుట్ అండర్‌బ్రిడ్జిలలో వర్షపునీరు చేరడంతో ట్రాఫిక్ స్థంభించింది. దీంతో వాహనదారులు, కొండాయపాలెం గేటు, భక్తవత్సలనగర్ రైల్వేగేటు, రంగనాయకులపేట రైల్వేగేట్లు మీదుగా రాకపోకలు సాగించారు. రంగనాయకులపేట నుంచి పెన్నానదికి వెళ్లే మార్గంలో ట్రాఫిక్ పూర్తిగా స్థంభించింది. పెన్నానది పరవళ్ళు తొక్కడంతో నగర నలుమూలల నుండి ప్రజలు పెన్నానది ఒడ్డుకు తరలివచ్చారు. ఆ ప్రాంతం జనసందోహంలా మారింది.




## శెభాష్ నేతలు...

భారీ వర్షాల నేపథ్యంలో వరద బాధితులను ఆదుకునేందుకు అన్ని రాజకీయ పార్టీల నేతలతో పాటు అధికారులు కూడా వేగంగా స్పందించడం, సహాయక చర్యల్లో పాల్గొనడం ఎంతైనా అభినందనీయం. ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పి.అనిల్ కుమార్, మేయర్ అబ్దుల్ అజీజ్, మాజీఎమ్మెల్యే వివేకా, బీజేపీ, కాంగ్రెస్, టిడిపి నాయకులు పెద్దసంఖ్యలో సహాయక చర్యల్లో పాల్గొని తమవంతు సాయమందించారు.

# కాంగ్రెస్‌కు రాం రాం?




**రాష్ట్ర విభజనకు ముందు ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్‌పార్టీ పరిస్థితి ఏంటి? ఉంటే అధికారంలో... లేదంటే ప్రతిపక్షంలో! అంటే శక్తివంత మైన పార్టీయే. కాబట్టి ఈ పార్టీ తరపున ఏ ఎన్నికల్లో పోటీ చేసినా గెలుపుకు ఫిఫ్టీ ఫిఫ్టీ చాన్స్ వుంటుంది. ఆనం వంటి సొంత కేడర్ వున్న నాయకులకయితే ఆ అవకాశాల శాతం ఎక్కువుగానే వుంటుంది. పార్టీ పటిష్టంగా ఉంటే ఎలాంటి కేడర్ వున్న నాయకుడైనా ఆ పార్టీలో ఉండగలుగుతాడు. పార్టీ బలహీన పడ్డప్పుడు బలవంతులైన నాయకులు కూడా బలహీన పడిపోతారు.**

విభజన తర్వాత ఏపిలో కాంగ్రెస్ బలహీన పడింది. 2014 ఎన్నికల్లో ఆంధ్రా ఓటర్లు కాంగ్రెస్‌కు చెంప చెళ్లుమనిపించారు. ఆ పార్టీ అభ్యర్థులకు డిపాజిట్లు కూడా లేవు. తమిళనాడు, పశ్చిమబెంగాల్, యూపి, బీహార్ రాష్ట్రాల్లో చచ్చుపడినట్లే ఏపిలోనూ కాంగ్రెస్ చచ్చుబడిపోయింది. 2014 ఎన్నికల ముందే చాలామంది నాయకులు కాంగ్రెస్‌ను వదిలేసి తెలుగుదేశం, వైకాపాలలో చేరిపోయారు. బొత్స లాంటోళ్లు ఎన్నికల తర్వాత కాంగ్రెస్‌ను వదిలేసారు. ఇక రాష్ట్రంలో ఆ పార్టీని పట్టుకుని ఊగులాడడం దండగనేది ఖాయమయిపోయింది.

ఈ క్రమంలో కాంగ్రెస్‌లో మిగిలివున్నోళ్లు కూడా రాజకీయ భవిష్యత్ చూసుకుంటున్నారు. ఈ పరంపరలో ఎప్పటినుండో ఆనం రామనారాయణరెడ్డి పేరు వినిపిస్తోంది. తాజాగా ఆయన బయటపడ్డాడు. తమ నెత్తిన కాంగ్రెస్‌పార్టీ మట్టేసిందని, ప్రత్యేకహోదా కోసం ఆ పార్టీ చేస్తున్న ఉద్యమాలు పెద్ద దండగని ఆయన సెలవిచ్చారు. ఏపి నెత్తిన కాంగ్రెస్ మట్టి వేయడంలో ఆనం పాత్ర ఉందన్నది కూడా ఏపి ప్రజలు అంత త్వరగా మరువరనేది వేరే విషయం. వీళ్లంతా కూడా కాంగ్రెస్‌ను వదిలేస్తే విభజన పాపం నుండి బయట పడ్డట్లేనని ఆలోచిస్తున్నట్లుంది. తన కుటుంబం కాంగ్రెస్‌లో వున్నప్పటికి తన రాజకీయ జీవితం మొదలైంది మాత్రం తెలుగుదేశంపార్టీలోనేనని చెప్పిన ఆనం ఆ పార్టీలో చేరాలనుకున్న తన ఉద్దేశ్యాన్ని చెప్పకనే చెప్పారు. ఆనం వాళ్లు వస్తామంటే చంద్రబాబు కూడా వద్దనే పరిస్థితి లేదు.

వాస్తవానికి 2014 ఎన్నికలకు ముందే రామనారాయణరెడ్డిని తెలుగుదేశంలో చేరమని కోరాడు చంద్రబాబు. ఆత్మకూరు సీటు గ్యారంటీతో పాటూ మంత్రి పదవి కూడా హామీ ఇచ్చాడు. అయితే ఆరోజు ఆనం పరిస్థితి వేరేగా వుండింది. విభజన బిల్లును నిరసిస్తూ కిరణ్‌కుమార్‌రెడ్డి ఎన్నికలకు రెండు నెలల ముందు రాజీనామా చేసినా ఆ సీటు తనకు దక్క వచ్చనే ఆశతో ఆయన కాంగ్రెస్‌లోనే వుండిపోయాడు. కాని కిరణ్‌కుమార్‌రెడ్డి ఆయన ఆశలను నీరుగార్చాడు. సీఎం సీటు దక్కకపోగా 2014లో ఆత్మకూరు సీటిచ్చారు. అక్కడ ఆయన అయిష్టంగానే దిగి డిపాజిట్ కూడా కోల్పోయారు.

ఇక రాష్ట్రంలో కాంగ్రెస్ కోలుకునే అవకాశాలు లేవు. ఆనం రామనారాయణరెడ్డికి రాజకీయాలపై యావ వుంది. దీనికి రాజకీయ వేదిక కావాలి. చేరితే తెలుగుదేశం లేదంటే వైకాపా! బొత్స వైకాపాలో చేరాక ఆయనకు సన్నిహితంగా వుండే రామనారాయణరెడ్డి కూడా ఆ పార్టీలో చేరుతాడనే వూహాగానాలు వచ్చాయి. కాంగ్రెస్‌ను వీడి వైకాపాను పెట్టాక జగన్‌ను అత్యధికంగా విమర్శించిన వారిలో ఆనం రామనారాయణరెడ్డిదే పైచేయి. జగన్‌ను ఎంత ఎక్కువుగా తిడితే సోనియాగాంధీ అంత తొందరగా సీఎం కుర్చీ ఇస్తుందని ఆయన ఆవేశపడ్డారు. జగన్‌ను తిట్టరాని తిట్లన్నీ తిట్టాడు. వ్యక్తిగతంగా విమర్శలు చేసాడు. మరి అంతలా తిట్టి ఇప్పుడు అదే జగన్ నాయకత్వంలో ఆయన పని చేస్తాడా? అని ప్రశ్నించిన వాళ్లు లేకపోలేదు. జగన్ నాయకత్వంలో పని చేయడం ఆనం లాంటి సీనియర్లకు కాస్తా కష్టంగానే వుంటుంది. ఆయనకు చంద్రబాబే బెటర్! ఈ కోణంలోనే ఆనం రామనారాయణరెడ్డి రాజకీయ పయనం ఇక తెలుగుదేశంలో వుండవచ్చని తెలుస్తోంది.



Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com